


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 10-11-2022 సంపుటి : 04 సంచిక : 71 పేజీలు : 4 వెల : రూ 3-00


## విశాఖలో ప్రధాని రోడ్ షో

విశాఖపట్నం భారత ప్రధాని నరేంద్ర మోడీ మరోసారి ఆంధ్రప్రదేశ్కు రానున్నారు.. విశాఖలో రెండు రోజుల పాటు ఆయన పర్యటన కొనసాగనుంది.. ఇక, ప్రధానికి గ్రాండ్ వెల్కమ్ చెప్పేందుకు సిద్ధం అవుతోంది ఏపీ బీజేపీ.. మరోవైపు.. ప్రధాని మోడీ.. వైజాగ్ పర్యటనపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు ఎంపీ జీవీఎల్ నరసింహారావు.. విశాఖలో మీడియాతో మాట్లాడిన ఆయన.. 11వ తేదీ



రాత్రి ప్రధాని విశాఖ చేరుకోగానే రోడ్ షో నిర్వహిస్తామని, కంచెర్లపాలెం నుండి ఓల్డ్ ఐటీఐ వరకూ కిలోమీటర్ మేర ఈ రోడ్షో ఉంటుందన్నారు.. రాత్రి 7 గంటల నుండి 8 గంటల వరకూ రోడ్ షో జరుగుతుందని.. 11న రాత్రి ఐఎన్ఎస్ చోళలో ప్రధాని బస చేస్తారని తెలిపారు. 12న 9 ప్రాజెక్టులకు శంఖుస్థాపన చేస్తారని,ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు.. ఇందులో 152 కోట్లతో చేపట్టే విశాఖ ఫిషింగ్ హార్బర్ ఆధునీకరణ ముఖ్యమైందని అన్నారు.రాయ్ పూర్–విశాఖ ఎకనామిక్ కారిడార్, విశాఖ రైల్వే స్టేషన్ ఆధునీకరణ , కాన్వెంట్ జంక్షన్ నుండి శీలా నగర్ వరకూ డైరెక్ట్ రోడ్, గైయిల్ ద్వారా శ్రీకాకుళం నుండి ఒడిశాలోని ఒంగుల్ వరకూ పైప్ లైన్ నిర్మాణం, గుంతకల్లులో ఐవోసీఎల్ చేపడుతున్న ప్రాజెక్ట్ను జాతికి అంకితం చెయ్యడం లాంటివి ఉన్నాయని వెల్లడించారు జీవీఎల్.ఆంధ్రప్రదేశ్లో మిగిలిన రైల్వే లైన్స్ అభివృద్ధి నిలిచిపోవడానికి కారణం రాష్ట్ర ప్రభుత్వం తన వాటా ఇవ్వక పోవడమేనని ఆరోపించిన ఆయన.. కనీసం పీఎం సమక్షంలోనన్నా సీఎం వైఎస్ జగన్ వీటికి హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరోవైపు.. ప్రధాని పర్యటనలో రాజధాని అంశం లేదని స్పష్టం చేశారు జీవీఎల్.. కేవలం కేంద్ర ప్రభుత్వానికి చెందిన అంశాలే ఉంటాయన్న ఆయన.. రైల్వే జోన్ను ఇప్పటికే ప్రకటించామని,త్వరలో దీనిపై ప్రత్యేకంగా వేరే ప్రకటన ఉంటుందన్నారు.జనసేన అధినేత పవన్ కల్యాణ్కు ఆహ్వానించడంపై పీఎంవో నిర్ణయం తీసుకుంటుందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఇష్యు ఈ పర్యటనలో లేదని స్పష్టం చేశారు బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ వద్ద తీవ్ర ఉద్రిక్తత



విశాఖపట్టణం,నవంబర్9(: విశాఖలో స్టీల్ ప్లాంట్ఆందోళనతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని ప్రధాని మోడీ దృష్టికి తీసుకెళ్లేందుకు చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఉదయం అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో విశాఖ స్టీల్ ప్లాంట్ మెయిన్ గేటు దగ్గర నుండి కార్మికుల పాదయాత్ర బయలుదేరుతుండగా... ఉద్రిక్తత చోటుచేసుకుంది. పాదయాత్రకు బయలుదేరిన నేతలను, కార్మికులను పోలీసులు అడ్డుకున్నారు. తోపులాట జరిగింది. విశాఖ స్టీల్ ప్లాంట్ వద్ద ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. వడ్లపూడు వద్ద స్టీల్ ప్లాంట్ కార్మికులు, ఉద్యోగులు రోడ్డెక్కి నిరసనకు దిగారు. ప్రధాని మోడీకి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. స్టీల్

**ప్రైవేటీలకరణ వ్యతిరేక ఆందోళన ఉధృతం**

**కార్మికుల ర్యాలీని అడ్డుకున్న పోలీసులు**

**ఎక్కడిక్కడే అరెస్ట్ చేసి స్టేసన్కుతరలింపు**


**మోడీకివ్యతిరేకంగా కార్మిక సంఘాల ఆందోళన**

**మోడీ గో బ్యాక్ అంటూ మిన్నంటిన నినాదాలు**



ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు.. వడ్లపూడు వద్ద ఉక్కు ఉద్యోగుల ర్యాలీని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో.. ఆందోళనకారులు.. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఈనెల 12న ప్రధాని మోడీ పర్యటన ఉండటంతో.. విశాఖ ఉక్కును కాపాడాలంటూ కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఈ సమయంలో కార్మికులు, ఉద్యోగులు డప్పు వాయిస్తూ.. గో బ్యాక్ మోడీ అంటూ నినాదాలు చేశారు. దీంతో ఆందోళనకారులను అడ్డుకున్న పోలీసులు వారిని అక్కడి నుంచి తరలించారు. అఖిలపక్ష కార్మిక సంఘాలు చేపట్టిన భారీ ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. ర్యాలీ ప్రారంభానికి ముందుగానే కూర్మన్నపాలెం గేట్ వద్ద పోలీసులు భారీగా మోహరించారు. అక్కడే ప్లకార్డులతో నిరసన తెలియజేస్తున్న కార్మికులను అడ్డగించారు.జివిఎంసి వరకూ ర్యాలీగా వచ్చి బహిరంగ సభ నిర్వహించాలని అఖిల పక్ష కార్మిక సంఘాలు ఇది వరకే నిర్ణయించగా ప్రభుత్వం అడ్డుకుంటోందని ప్రజలు, కార్మికులు తీవ్రంగా వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. మోడీ భజన మాని.. ఎ÷–లాంట్ ని రక్షించాలని ఉత్తరాంధ్ర అభివఅద్ధికి జగన్ తోడ్పాడాలంటూ కార్మికులు ముక్త కంఠంతో నినాదాలు చేసి హోరెత్తించారు. బైక్ ర్యాలీని పోలీసులు అడ్డుకోవడంతో కార్మికులు పాదయాత్రగా బయలుదేరారు. మంగళవారం ఎన్ఎడి కొత్త రోడ్డు వరకే బైక్ ర్యాలీ నిర్వహించు కోవచ్చునని పోలీసులు అనుమతినిచ్చారు. ఈ రోజు ఆ అనుమతిని రద్దు చేశారు. దీంతో కార్మికులంతా మూడు బృందాలుగా ఏర్పడి పాదయాత్ర చేపట్టారు.

## 2024 టీడీపీ, కాంగ్రెస్ మధ్యే పోటీ



విజయవాడ, నవంబర్ 9, 2024లో సార్వత్రిక ఎన్నికలు రాబోతున్నాయి.. ఆంధ్రప్రదేశ్లో రాజకీయా పరిణామాలు మారబోతున్నాయి.. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ, తెలుగుదేశం పార్టీ మధ్యే పోటీ ఉంటుందని జోస్యం చెప్పారు.. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, తిరుపతి మాజీ ఎంపీ చింతామోహన్.. తిరుపతిలో ఇవాళ మీడియాతో మాట్లాడిన ఆయన.. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర కన్యాకుమారిలో మొదలై ప్రస్తుతం మహారాష్ట్రలో సాగుతుందన్నారు.. చిన్నా భిన్నం అవుతున్న దేశాన్ని కాంగ్రెస్ పార్టీ మళ్లీ ఏకం చేస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేసిన ఆయన.. నోట్ల రద్దుతో దేశంలో ఆర్థిక కష్టాలు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు..మరోవైపు.. ఆంధ్రప్రదేశ్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని తెలిపారు చింతామోహన్.. వైసీపీ ప్రభుత్వం దళితుల సంక్షేమ పథకాలు ఎత్తేసి ద్రోహం చేస్తోందన్న ఆయన.. రాబోయే ఎన్నికల్లో వైసీపీ, బీజేపీలు తుడిచిపెట్టుకుపోతాయన్నారు.. 2024 ఎన్నికల్లో రాజకీయ ఎన్నికల యుద్ధం కాంగ్రెస్, టీడీపీ మధ్యే జరుగుతుందని పేర్కొన్నారు చింతామోహన్. కాగా, రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర.. కన్యాకుమారిలో ప్రారంభమై కాశ్మీర్ వరకు సాగనుంది.. ఇప్పటికే తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ముగిసిన జోడో యాత్ర.. ప్రస్తుతం మహారాష్ట్రలో కొనసాగుతోన్న విషయం విదితమే.. తాను చేపట్టిన పాదయాత్రకు అన్ని వర్గాల నుంచి మద్దతు లభిస్తుందని.. లక్షలాది మంది కదలివస్తున్నారని.. దేశాన్ని సమైక్యం చేసేందుకు భారత్ జోడో యాత్ర చేపట్టానని పలు వేదికలపై రాహుల్ గాంధీ ప్రకటించిన విషయం తెలిసిందే.

## నవంబర్ 11న సీఎం జగన్ గుంటూరు పర్యటన

గుంటూరు : సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి గుంటూరు పర్యటన ఏర్పాట్లను ప్రజాప్రతినిధులు, అధికారులు సోమవారం పరిశీలించారు.భారత తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంత్యుత్సవం సందర్భంగా ఈ నెల 11న గుంటూరులో జరగనున్న కార్యక్రమాలకు ముఖ్యమంత్రి హాజరుకానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లేళ్ళ అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు మద్దాళిగిరి, మొహమ్మద్ ముస్తఫా, మేయర్ కావటి మనోహర్ నాయుడు, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఇంతియాజ్, కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణ



శర్మ సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు. తొలుత పోలీస్ పరేడ్ మైదానంలోని హెలిప్యాడ్ను పరిశీలించారు.అక్కడి నుంచి ముఖ్యమంత్రి పర్యటించే మార్గాలు, ట్రాఫిక్, సెక్యూరిటీ అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ మెడికల్ కాలేజీలోని జింఖానా మైదానం, వేంకటేశ్వర విజ్ఞాన మందిరాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి వచ్చి వెళ్ళే వరకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని ప్రజాప్రతినిధులు సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు (డైమండ్ బాబు), షేక్ సజిల, పూసల, కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్పర్సన్ కోలా భవాని, వైఎస్సార్సీపీ నాయకులు గులాం రసూల్, గుంటూరు ఆర్డీఓ ప్రభాకరరెడ్డి, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఎండి.ఘని పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి ప్రత్యేక ఆహ్వానంతో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఇంతియాజ్, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లేళ్ళ అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు మద్దాళిగిరి, మొహమ్మద్ ముస్తఫా, మేయర్ కావటి మనోహర్ నాయుడు, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణ శర్మ కలెక్టరేట్లో సమావేశమయ్యారు. సీఎం పర్యటనపై కూలంకషంగా చర్చించారు.

## ఏపీ హైకోర్టులో అయ్యన్నపాత్రుడికి చుక్కెదురు..

**సీఐడీ విచారించుకోవచ్చు**



, అమరావతి: ఏపీ హైకోర్టులో టీడీపీ సీనియర్ నేత అయ్యన్నపాత్రుడికి చుక్కెదురైంది. తన పైన సీఐడీ నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ దాఖలు చేసిన పిటిషన్పై హైకోర్టు బుధవారం కీలక ఆదేశాలు ఇచ్చింది.ప్రభుత్వ స్థలం ఆక్రమణ కేసును కొట్టేసేందుకు నిరాకరించిన హైకోర్టు.. 41ఏ నోటీసు ఇవ్వాలని సంబంధిత విచారణ సంస్థకు సూచించింది. అంతేకాదు.. అయ్యన్నపాత్రుడిని, ఆయన తనయుడు రాజేష్ను సీఐడీ విచారించుకోవచ్చని తెలుపుతూ.. విచారణకు అయ్యన్నపాత్రుడు సహకరించాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది.

## బంగాళాఖాతంలో అల్పపీడనం.

విశాఖపట్టణం, నవంబర్ 9,ఆంధ్రప్రదేశ్కు భారీ వర్ష సూచన ఉందని తెలిపింది వాతావరణశాఖ. నైరుతి బంగాళాఖాతం, హిందూ మహాసముద్రాలను ఆనుకుని ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని ఐఎండీ వెల్లడించింది. దీని ప్రభావంతో రాగల 48 గంటల్లో అల్పపీడనం ఏర్పడనుందని తెలిపింది. ఇది క్రమంగా వాయవ్య దిశగా పయనించి తమిళనాడు–పుదుచ్చేరి తీరాల వైపు వస్తుందని పేర్కొంది. దీని ప్రభావంతో ఈ నెల 11, 12 మరియు 13 తేదీల్లో రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్రలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని, అక్కడక్కడ భారీ వర్షాలు పడతాయని తెలిపింది.అల్పపీడనం ప్రభావంతో ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు రాష్ట్రంలోని దక్షిణ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది.. 11వ తేదీన తిరుపతి, నెల్లూరు.. 12న తిరుపతి, నెల్లూరు, చిత్తూరు, అన్నమయ్య, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని.. మిగతా ప్రాంతాల్లో కొన్ని చోట్ల తక్కువ వర్షం పడుతుందని వివరించింది.. అయితే, నైరుతి బంగాళాఖాతానికి ఆనుకుని ఉన్న భూమధ్య రేఖ ప్రాంతంలోని హిందూ మహా సముద్రంపై ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని.. దాని ప్రభావంతో వచ్చే 48 గంటల్లో అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని.. వాయువ్య దిశగా తమిళనాడు, పుదుచ్చేరి తీరం వైపు అల్పపీడనం కదిలే అవకాశం ఉందని.. దీని ప్రభావంతో మూడు రోజులపాటు ఏపీలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది వాతావరణ శాఖ.

## ప్రధాని మోడీ వైజాగ్ పర్యటన..

**ఎంపీ జీవీఎల్ ఆసక్తికర వ్యాఖ్యలు**

విశాఖపట్టణం, నవంబర్ 9, భారత ప్రధాని నరేంద్ర మోడీ మరోసారి ఆంధ్రప్రదేశ్కు రానున్నారు.. విశాఖలో రెండు రోజుల పాటు ఆయన పర్యటన కొనసాగనుంది.. ఇక, ప్రధానికి గ్రాండ్ వెల్కమ్ చెప్పేందుకు సిద్ధం అవుతోంది ఏపీ బీజేపీ.. మరోవైపు.. ప్రధాని మోడీ.. వైజాగ్ పర్యటనపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు ఎంపీ జీవీఎల్ నరసింహారావు.. విశాఖలో ఇవాళ మీడియాతో మాట్లాడిన ఆయన.. 11వ తేదీ రాత్రి ప్రధాని విశాఖ చేరుకోగానే రోడ్ షో నిర్వహిస్తాం.. కంచెర్లపాలెం నుండి ఓల్డ్ ఐటీఐ వరకూ కిలోమీటర్ మేర ఈ రోడ్షో ఉంటుందన్నారు.. రాత్రి 7 గంటల నుండి 8 గంటల వరకూ రోడ్ షో జరుగుతుందని.. 11న రాత్రి ఐఎన్ఎస్ చోళలో ప్రధాని బస చేస్తారని తెలిపారు. 12న 9 ప్రాజెక్టులకు శంఖుస్థాపన చేస్తారు.. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు.. ఇందులో 152 కోట్లతో చేపట్టే విశాఖ ఫిషింగ్ హార్బర్ ఆధునీకరణ ముఖ్యమైంది.. ఇది లక్ష పైన మత్స్యకార కుటుంబాలకు ఒక వరం లాంటిదని పేర్కొన్నారు. కోల్డ్ స్టోరేజీ, ఏసీ ఆక్షన్ హాల్, కొత్త జేటీల నిర్మాణం లాంటివి కూడా ఉన్నాయి.. రాయ్ పూర్–విశాఖ ఎకనామిక్ కారిడార్, విశాఖ రైల్వే స్టేషన్ ఆధునీకరణ , కాన్వెంట్ జంక్షన్ నుండి శీలా నగర్ వరకూ డైరెక్ట్ రోడ్, గైయిల్ ద్వారా శ్రీకాకుళం నుండి ఒడిశాలోని ఒంగుల్ వరకూ పైప్ లైన్ నిర్మాణం, గుంతకల్లులో ఐవోసీఎల్ చేపడుతున్న ప్రాజెక్ట్ను జాతికి అంకితం చెయ్యడం లాంటివి ఉన్నాయని వెల్లడించారు జీవీఎల్.ఇక, విజయవాడ–నర్సాపూర్–భీమవరం–గుడివాడ–నిడదవోలు రైల్వే లైన్ డెవలప్ చెయ్యడం జరిగింది. దీనిలో 50 శాతం రాష్ట్ర వాటా ఇవ్వాల్సి ఉంది.. కానీ, ఇప్పటి వరకు ఆ ఖర్చు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదని విమర్శించారు జీవీఎల్ నరసింహారావు.. ఆంధ్రప్రదేశ్లో మిగిలిన రైల్వే లైన్స్ అభివృద్ధి నిలిచిపోవడానికి కారణం రాష్ట్ర ప్రభుత్వం తన వాటా ఇవ్వక పోవడమేనని ఆరోపించిన ఆయన.. కనీసం పీఎం సమక్షంలోనన్నా సీఎం వైఎస్ జగన్ వీటికి హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరోవైపు.. ప్రధాని పర్యటనలో రాజధాని అంశం లేదని స్పష్టం చేశారు జీవీఎల్.. కేవలం కేంద్ర ప్రభుత్వానికి చెందిన అంశాలే ఉంటాయన్న ఆయన.. రైల్వే జోన్ను ఇప్పటికే ప్రకటించాం.. రైల్వే జోన్ పై ప్రత్యేకంగా వేరే ప్రకటన ఉంటుందన్నారు.. ఇక, ఇది అధికారిక పర్యటన కాబట్టి.. జనసేన అధినేత పవన్ కల్యాణ్కు ఆహ్వానించడంపై పీఎంవో నిర్ణయం తీసుకుంటు ందన్నారు.. కానీ, ప్రధాని విశాఖ పర్యటనను చిన్న చిన్న రాజకీయాల కోణంలో చూడొద్దు? ప్రధాని ఒకటిన్నర రోజు విశాఖలో గడపడం అనేది వైజాగ్ ప్రజలకు ఎంతో గర్వకారణం అన్నారు.

## పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం

తాడేపల్లి తాడేపల్లి మండలం ఇప్పటం లో ఇళ్లు కోల్పోయిన బాధితులకు లక్ష రూపాయల చొప్పున సాయాన్ని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రకటించారు. దాంతో జనసేన నేతలు పవన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేసారు. వంకరగా ఆలోచించే వైసీపీ నేతలు.. వాస్తవంలోకి రావాలంటూ సెటైర్లు వేసారు.జనసేన రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు మాట్లాడుతూ ఇప్పటం గ్రామస్తులు.. జనసేన సభకు స్థలం ఇవ్వడమే పాపమా. రోడ్డు విస్తరణ పేరుతో అడ్డగోలుగా ఇళ్లను కూల్చేశారు. ఇప్పటం గ్రాస్తులు కాళ్లా వేళ్లా పడినా కనీసం కనికరించలేదని అన్నారు. రాజకీయ కారణాలతో ... పేదల గూడు కూల్చేయడం దుర్మార్గం. ఇంత దారుణం, దమన కాండ ఏ రాష్ట్రంలోనూ లేదు. కూల్చడం మాత్రమే తెలిసిన జగన్ ప్రభుత్వం త్వరలో కూలిపోవడం ఖాయం. ప్రభుత్వ జీవోలు ఇస్తేనే వైసీపీ నేతలు పాలాభిషేకాలు చేసుకుంటున్నారు. కానీ మా అధినేత పవన్ కళ్యాణ్ సొంత డబ్బుతో ప్రజలను ఆదుకుంటున్నారు. ఇప్పటంలో ఇంటింటికీ వెళ్లి నేనున్నా అనే భరోసా పవన్ కళ్యాణ్ కల్పించారు. కులాలు చూడకుండా కూల్చిన ప్రతి ఇంటికీ లక్ష రూపాయలు సాయం ప్రకటించారు. చనిపోయిన కౌలు రైతుల కుటుంబాల కోసం ఇప్పటికే ఐదు కోట్లు కష్టార్జితం ఇచ్చారు. వచ్చే ఎన్నికలలో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు.

# సంపాదకీయం

గురువారం 10-11-2022

## రిజర్వేషన్లతో పేదరికం పోతుందా

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పును ఇచ్చింది. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ యుయు లలిత్ రిటైర్మెంట్ రోజు ఆయన నేతృత్వం వహించిన ఐదుగురు సభ్యుల ధర్మాసనం కీలక తీర్పు చెప్పింది. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు గతంలో కేంద్రం ఇచ్చిన పది శాతం రిజర్వేషన్లను సమర్థించింది. ఆ కోటా రద్దుకు దాఖలైన పిటిషన్లను డిస్మస్ చేసింది ధర్మాసనం. ఈ తీర్పుతో విద్య, ఉద్యోగ అవకాశాల్లో ఇమీ కింద పది శాతం రిజర్వేషన్లు కొనసాగుతాయి. ఐదుగురు న్యాయమూర్తుల్లో ముగ్గురు కోటాను సమర్థించారు. ఇద్దరు వ్యతిరేకించారు. పది శాతం కోటా కల్పిస్తూ కేంద్రం చేసిన 103 రాజ్యాంగ సవరణ? రాజ్యాంగ మూల స్వరూపానికి భంగం కాదని జస్టిస్ దినేష్ మహేశ్వరి, జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ పార్ధివాలా తీర్పు చెప్పారు. చీఫ్ జస్టిస్ యుయు లలిత్, జస్టిస్ రవీంద్ర భట్ మాత్రం భిన్నమైన తీర్పు చెప్పారు. ఈ కోటాతో మొత్తం రిజర్వేషన్లు 50 శాతం దాటతాయని అభిప్రాయపడ్డారు. ఆర్థిక ప్రాతిపదికన సాధారణ కేటగిరీ ప్రజలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ ప్రాథమిక స్ఫూర్తికి విరుద్ధం కాదని స్పష్టం చేసింది. సుప్రీం కోర్టులోని ఐదుగురు న్యాయమూర్తుల బెంచ్‌లో ముగ్గురు న్యాయమూర్తులు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చారు. దీంతో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కొనసాగనుంది. ఈడబ్ల్యూఎస్ కోటా కింద ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 2019లో కేంద్ర ప్రభుత్వం బిల్లును తీసుకువచ్చింది. ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ.. 30కి పైగా పిటిషన్లు సుప్రీం కోర్టులో దాఖలైన విషయం తెలిసిందే. ఈ పిటిషన్లపై సెప్టెంబర్ 27న విచారించిన కోర్టు.. ప్రధాన న్యాయమూర్తి యుయు లలిత్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. జస్టిస్ దినేష్ మహేశ్వరి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌కు సంబంధించిన 103వ రాజ్యాంగ సవరణను సమర్థించారు. ఇది రాజ్యాంగక ప్రాథమిక నిర్మాణాన్ని ఉల్లంఘించదని చెప్పారు. జస్టిస్ బేల ఎం త్రివేది, జస్టిస్ జెబి పార్ధివాలా కూడా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు మద్దతు ఇచ్చారు.జస్టిస్ రవీంద్ర భట్ రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా తీర్పునిచ్చారు. ఇది ప్రాథమిక స్ఫూర్తికి అనుగుణంగా లేదని అన్నారు. ఎస్టీ, ఎస్సీ, ఓబీసీలను రిజర్వేషన్లకు దూరంగా ఉంచడం సరికాదన్నారు. ప్రధాన న్యాయమూర్తి ఉదయ్ ఉమేష్ లలిత్ కూడా ఆర్థిక ప్రాతిపదికన సాధారణ కేటగిరీ ప్రజలకు రిజర్వేషన్లు ఇవ్వాలనే నిర్ణయానికి వ్యతిరేకంగా తీర్పునిచ్చారు. ఆర్థిక కారణాలతో ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ కమ్యూనిటీని రిజర్వేషన్లకు దూరంగా ఉంచడం వివక్షాపూరితమని అన్నారు. ఈ విషయంలో జస్టిస్ భట్ అభిప్రాయాన్ని ఆయన సమర్థించారు. అయితే 3:2 మెజారిటీతో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు సుప్రీం కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆర్థిక ప్రాతిపదికన జనరల్ కేటగిరీ ప్రజలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు 2019 జనవరి 8న కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ బిల్లుకు అనుకూలంగా 323 ఓట్లు రాగా.. 3 ఓట్లు వ్యతిరేకంగా వచ్చాయి. డీఎంకే, లెఫ్ట్ పార్టీల ఎంపీలు కేంద్రం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఓటింగ్‌లో పాల్గొనలేదు. ఈడబ్ల్యూఎస్ బిల్లును 2019 జనవరి 10న రాజ్యసభలో ప్రవేశపెట్టారు. 165 మంది ఎంపీలు అనుకూలంగా ఓటు వేయగా.. ఏడుగురు 7 ఎంపీలు వ్యతిరేకంగా ఓటు వేశారు.2019 జనవరి 31 న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. 103వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 15, 16కి క్లాజ్ (6)ని జోడించి ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాలకు ఉద్యోగాలు కల్పించింది. దేశవ్యాప్తంగా విద్యా సంస్థలు.. ఉద్యోగాలలో 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు ప్రకటించింది.ఫిబ్రవరి 2020లో ఐదుగురు విద్యార్థులు మధ్యప్రదేశ్ హైకోర్టులో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా పిటిషన్ వేశారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ నుంచి మినహాయించారని.. ఇది రాజ్యాంగం ప్రాథమిక స్ఫూర్తికి విరుద్ధమన్నారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ.. తమిళనాడు అధికార పార్టీ డీఎంకే సహా పలువురు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.అప్పటి అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాతో సహా సీనియర్ న్యాయవాదుల వాదనలను విన్న సుప్రీంకోర్టు.. ఈడ బ్ల్యూఎస్ రిజర్వేషన్ రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని ఉల్లంఘి స్తుందా అనే చట్టపరమైన ప్రశ్నపై సెప్టెంబర్ 27న తీర్పును రిజర్వ్ చేసింది. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ.. విద్యా వేత్త మోహన్‌గోపాల్ సెప్టెంబర్ 13న బెంచ్ ముందు వాదిం చారు.కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ''బ్యాక్‌డోర్'' రిజర్వేషన్ భావనను నాశనంచేసే ప్రయత్నమన్నారుఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీం కోర్టు సమర్థిస్తూ తీర్పు ఇచ్చింది.

# మునుగోడు... నంద్యాల ఒక్కటే స్ట్రాటజీనా

కర్నూలు, నవంబర్ 9, మునుగోడు ఉప ఎన్నికల ప్రభావం వచ్చే సాధారణ ఎన్నికలపై ఉంటుందా? ఇప్పుడు గెలిచిన పార్టీకి అడ్వాంటేజీ ఉంటుందా? ఓడిన పార్టీని జనం ఆదరించరా? అంటే అవునని చెప్పడానికి లేదు. మునుగోడు ఉప ఎన్నిక ఫలితంతో గెలిచిన పార్టీకి ఒరిగేదేమీ ఉండదు. ఓడిన పార్టీలకు నష్టమేదీ ఉండదు. ఈ ఎన్నిక సాధారణ ఎన్నికలు సెమీ ఫైనల్స్ కానే కాదు. ప్రత్యేక పరిస్థితుల్లోనే మునుగోడు ఉప ఎన్నిక జరిగింది. ఉప ఎన్నిక కావడం, అక్కడ అన్ని శక్తులు మొహరించడం వల్ల కొన్ని పార్టీలకు ఎక్కువ ఓట్లు రావచ్చు. ఇంకొన్ని పార్టీలకు డిపాజిట్లు దక్కకపోయి ఉండవచ్చు. కానీ ఇవేమీ వచ్చే సాధారణ ఎన్నికల ఫలితాల్లో చూపవు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ లో నంద్యాల ఉప ఎన్నిక ఇందుకు నిదర్శనం. 2017లో నంద్యాల ఉప ఎన్నిక జరిగింది. భూమా నాగిరెడ్డి మరణంతో ఆయన సోదరుడి కుమారుడు బ్రహ్మానందరెడ్డిని అభ్యర్థిగా ప్రకటిస్తే, శిల్పా మోహన్ రెడ్డి టీడీపీకి రాజీనామా చేసి వచ్చ పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో అప్పట్లో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ మంత్రులను మండలాల వారీగా మొహరించింది. ఎమ్మెల్యేలను ఇన్‌ఛార్జులుగా నియమించింది. చివరకు టీడీపీ అభ్యర్థి దాదాపు 27 వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. దీంతో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని నియోజకవర్గాల్లో నంద్యాల ఫార్ములా అని ప్రకటించారు. ప్రతి నియోజకవర్గంలోనూ నంద్యాల ఫార్ములాను అనుసరించాలని ఆదేశాలు జారీ చేశారు. కానీ రెండేళ్ల తర్వాత జరిగిన ఎన్నికల్లో అంటే 2019 లో వైసీపీ అక్కడ గెలిచింది. అంతేకాదు రాష్ట్రంలోనూ వైసీపీ అధికారంలోకి వచ్చిందన్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. నంద్యాలలోనే శిల్పా రవిచంద్రారెడ్డి దాదాపు ముప్ఫయి వేల మెజారిటీతో గెలిచారు. అంటే నంద్యాల ఫార్ములా తర్వాత సాధారణ ఎన్నికల్లో అదే నంద్యాలలో పనిచేయలేదన్నది స్పష్టంగా తెలిసింది. ఇక మునుగోడు ఉప ఎన్నికను కూడా అంతే చూడాలి. టీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావచ్చు. దానిని ఎవరూ కాదనలేరు. ప్రజలు మొగ్గు చూపితే ఎవరైనా అధికారంలోకి వచ్చే వీలుంటుంది. మునుగోడు ఉప ఎన్నికల్లో గెలిచినంత మాత్రాన ఎవరికీ ఒరిగేదేమీ లేదన్నది వాస్తవం. కాకుంటే అధికారంలో ఉన్న పార్టీకి మరో ఎమ్మెల్యే వచ్చి చేరారు. అంతే తప్ప మునుగోడు విజయంతో వచ్చే ఎన్నికల్లో గెలుస్తారని ఎవరూ అంచనా వేయలేరు. మొన్న జరిగిన హుజూరాబాద్ లో గెలిచిన బీజేపీ నిన్న జరిగిన మునుగోడులో గెలవలేకపోయింది. ఉప ఎన్నికలకు, సాధారణ ఎన్నికలకు పొంతన లేదు. ఏ ఫార్ములా పనిచేయదు. అప్పటి ట్రెండ్ ను బట్టి ఏ పార్టీ అయినా అధికారంలోకి వచ్చే వీలుందన్నది వాస్తవం.

# వచ్చే నెలలో ఏపీలో ఏం జరుగుతుంది

విజయవాడ, నవంబర్ 9,నిజమే.. ఇప్పుడు కేసీఆర్ మాటలు ఆంధ్రప్రదేశ్ లోని ప్రతి రాజకీయ నేతల చెవుల్లో రింగు మంటున్నాయి. ఏపీ ప్రభుత్వాన్ని కూడా కూలదేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తుందని, వచ్చే నెలలో ముహూర్తం ఫిక్స్ చేశారని ఆ ముగ్గురు మాట్లాడిన వీడియోలో వినపడినట్లు కేసీఆర్ చెప్పారు. దీంతో డిసెంబరు నెలలో ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది. ఇంటలిజెన్స్ ను కూడా ప్రభుత్వం అప్రమత్తం చేసింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్యేల కొనుగోలు అంశం ఇప్పుడు కీలకంగా మారింది. కేసీఆర్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి రాగా, ఏపీలో జగన్ ప్రభుత్వం తొలిసారి పవర్ లోకి వచ్చింది. ఇద్దరూ బంపర్ మెజారిటీని సాధించారు. ఈ ప్రభుత్వాలను కూలదోయాలంటే అది సాధ్యమా? అన్న ప్రశ్న తలెత్తుతుంది ఇద్దరు సీఎంలు ఎమ్మెల్యేలతో కలిసే వారు కాదు. ఒక రకంగా నియంతల్లా వ్యవహరిస్తారన్న విమర్శలు ఇద్దరిపైనా ఉన్నాయి. ఎమ్మెల్యేలే కాదు.. మంత్రులు కూడా కేబినెట్ సమావేశాల్లో తప్ప వారిని కలుసుకునే అవకాశం లేదు. తమ నియోజకవర్గం సమస్యలు చెప్పుకోవాలనుకున్నా వీలుండదు. ఒకవేళ తమ నియోజకవర్గంలో ఏదైనా ముఖ్యమంత్రి కార్యక్రమం ఉంటే తప్ప ఇద్దరూ ఎమ్మెల్యేలకు అందుబాటులోకి రారు. వారి డిమాండ్ల చిట్టా వినరు. ఇద్దరూ వారి ఫొటో వల్లనే అధికారంలోకి వచ్చామన్న ధోరణితో ఉంటారు. ప్రాంతీయ పార్టీలు కావడంతో అధినేతలే మోనార్క్ లు. వారు చెప్పిందే వేదం. వారు అనుకున్నట్లే జరగాలి తప్పించి ప్రజాస్వామ్య బద్ధంగా నిర్ణయాలు ఉంటాయనుకోవడం అపోహ మాత్రమే. అందుకే ఎమ్మెల్యేల్లో అసంతృప్తి ఉంటుందని అంచనా వేశారన్నది కొందరి అభిప్రాయం. కూల్చివేత అనేది చాలా పెద్ద విషయం. ఏపీలో తీసుకుంటే బీజేపీకి ఒక్క ఎమ్మెల్యే కూడా లేరు. జగన్ పార్టీకి 155 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. అలాగే తెలంగాణలోనూ బీజేపీకి ముగ్గురు మాత్రమే ఎమ్మెల్యేలు ఉన్నారు. రెండు ప్రభుత్వాలను కూలగొట్టాలంటే ఎమ్మెల్యేల సంఖ్య భారీగానే కావాలి. అయితే అంత ధైర్యం, ఆ సాహసం ఎమ్మెల్యేలు ఇప్పుడున్న పరిస్థితుల్లో చేస్తారా? అంటే చేయరనే అనుకోవాల్సి ఉంటుంది. కేవలం ఏడాది, ఏడాదిన్నరలో ఎన్నికలు వస్తాయి. ఇప్పుడు పార్టీ మారేందుకు ఎవరూ ఆలోచన చేయరు. అందులో రెండుచోట్లా అధికార పార్టీగానే ఉండటంతో అది సాధ్యం కాదన్నది విశ్లేషకుల అంచనా. ఎమ్మెల్యేల్లో అంత అసహనం ఉంటే అధికారంలో ఉన్న పార్టీని వీడేంత ధైర్యం చేయరు. ఒకవేళ మారినా ఏపీలో అయితే టీడీపీ వైపో, జనసేన వైపో చూస్తారు కాని ఏమీ లేని బీజేపీ వైపు కన్నెత్తి కూడా చూడరు. అందుకే వీళ్లెవరో మాట్లాడిన మాటలు ట్రాష్ గా వైసీపీ అధినాయకత్వం కొట్టిపారేస్తుంది. పైగా జగన్ ఏపీ నుంచి కేంద్ర ప్రభుత్వానికి అన్ని విధాలుగా అండగా ఉన్నారు. కేసీఆర్ శత్రువుగా ఉన్నా వారికి వచ్చే నష్టమేమీ లేదు. ఇద్దరూ కాంగ్రెస్ కు వ్యతిరేకులే. అందుకే ఈ కొనుగోలు వ్యవహారం అంతా ఒట్టి బూటకమని ఏపీ వైసీపీ నేతలు కొట్టిపారేస్తున్నారు. ఏపీలో అంత సీన్ లేదని, తెలంగాణలోనూ అంతేనని వస్తే, గిస్తే రెండు చోట్ల బీజేపీ వచ్చే ఎన్నికల్లో కొన్ని స్థానాల్లోనై?నా గెలిస్తే చాలునన్న కామెంట్స్ పొలిటికల్ అనలిస్ట్‌ల నుంచి వినపడుతున్నాయి.

# పవన్ టార్గెట్ గా ఆలీ



విజయవాడ, నవంబర్ 9, ఏంటో మరి రాజకీయాల్లో పదవులు వచ్చిన నేతలు..ప్రత్యర్థులని తిట్టడానికే అన్నట్లు పనిచేస్తున్నారు. అంటే ప్రత్యర్థులని తిడితినే పదవులు అనే పాలసీని అధికార పార్టీలు గట్టిగా ఫాలో అవుతున్నాయి. ప్రతిపక్ష నాయకులని ఎంత గట్టిగా తిడితే..అంత ఎక్కువగా పదవి వచ్చే ఛాన్స్ గాని, పదవి నిలిచే ఛాన్స్ గాని ఉందని చెప్పొచ్చు.ఇక ఏపీలో అధికారంలో ఉన్న వైసీపీ ఇదే పాలసీని బాగా ఫాలో అవుతుంది. ఉండటానికి 25 మంత్రులు ఉన్నారు..కానీ ఎవరు ఏ శాఖకు సంబంధించి పనిచేస్తున్నారు..వారి శాఖల్లో జరుగుతున్న పనులు అనేవి ప్రజలకు తెలియదు గాని..వారు ప్రతిపక్ష నేతలని తిట్టడం మాత్రం తెలుసు. ఇలా పదవులు ఉన్న ప్రతి నాయకుడు..సీఎంకు భజన చేయడం, ప్రతిపక్ష నేతలపై విమర్శలు చేయడం.ఇదే క్రమంలో సినీ నటుడు ఆలీ సైతం..అదే దారిలో ముందుకెళ్లడం మొదలుపెట్టారు. సినీ ఇండస్ట్రీలో పవన్ స్నేహితుడుగా ఉన్న ఆలీ..వైసీపీలో చేరిన తర్వాత..ఆయన రాజకీయం మారింది. ఇక తాజాగా ఆయనకు ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు పదవి వచ్చింది. తాజాగా ఆయన పదవి బాధ్యతలు చేపట్టారు. ఇలా బాధ్యతలు చేపట్టిన వెంటనే..జగన్ ప్రభుత్వం గురించి భజన చేయడం మొదలుపెట్టారు. ఇక తనకు తెలిసి ఆ ఆరోపణలు కరెక్ట్ కాదని, పవన్‌కు పరోక్షంగా కౌంటర్ ఇచ్చారు.ప్రజల ఆదరణ పొందిన పార్టీ వైసీపీ అని, ప్రజలు 151 సీట్లు ఇచ్చారని, "మీ పాలన బాగుంటుంది. అద్భుతం అవుతుంది, స్వర్ణాంధ్రప్రదేశ్ అవుతుంది" అని ప్రజలు నమ్మారని, విశాఖపట్నం కావచ్చు, రాయలసీమ కావచ్చు, అన్నిచోట్ల అభివృద్ధి జరుగుతోందని చెప్పుకొచ్చారు. ఇక వైజాగ్ బీచ్ రోడ్లు, అక్కడ అద్భుతమైన అభివృద్ధి జరుగుతుందని మాట్లాడారు. అయితే రాష్ట్రం బాగుండాలనే ప్రజలు జగన్‌ని గెలిపించారు..మరి బాగుందా? అంటే అది ప్రజలని ఆలీ అడిగి తెలుసుకుంటే బెటర్ అని ప్రతిపక్ష శ్రేణులు కౌంటర్ ఇస్తున్నాయి.ఏపీలో ఎక్కడ అభివృద్ధి జరుగుతుందో ఆలీ చూపించాలని అంటున్నారు. పదవి ఇచ్చిందే పవన్‌ని తిట్టడానికని, అందుకే ఆలీ తన బాధ్యతలు నెరవేస్తున్నారని జనసేన శ్రేణులు అంటున్నాయి. మొత్తానికి పదవి రాగానే ఆలీ కూడా ప్రతిపక్షాలపై విమర్శలు స్టార్ట్ చేసేశారు.

# కనిపించకుండా ప్రభావం


గుంటూరు, నవంబర్ 9, గత కొన్ని రోజులుగా ఏపీ రాజకీయాల్లో పవన్ కల్యాణ్ దూకుడుగా రాజకీయం చేస్తున్న విషయం తెలిసిందే..విశాఖలో తనని అడ్డుకున్న దగ్గర నుంచి ఏ మాత్రం తగ్గకుండా తెగించి మరీ రాజకీయం చేస్తున్నారు. ఇంతకాలం ఓర్పుతోనే రాజకీయం చేస్తూ వచ్చారు..కానీ వైసీపీ నేతలు పదే పదే పవన్‌ని వ్యక్తిగతం టార్గెట్ చేసి బూతులు తిట్టడంతో పవన్ కూడా రివర్స్ అయ్యారు..వారికి అదే బాషలో కౌంటర్లు కూడా ఇచ్చారు. అలాగే చంద్రబాబు కలిశాక పవన్ మరింత దూకుడుగా వెళుతున్నారు.ఇప్పటంలో ఇళ్ల కూల్చివేతపై వైసీపీకి గట్టి కౌంటర్లు ఇచ్చారు?వైసీపీ ప్రభుత్వాన్ని కూల్చివేస్తామని వార్నింగ్ ఇచ్చారు. ఇక కేసులు పెట్టుకున్న పర్లేదు..అరెస్ట్ అయిన పర్లేదు అనే విధంగా పవన్ తెగించేసి రాజకీయం చేస్తున్నారు. పవన్ దెబ్బకు పోలీసులు కూడా ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఇప్పటివరకు ప్రతిపక్ష నేతలని, కార్యకర్తలని కేసులు పెట్టో, జైల్లో పెట్టో కాస్త నిలువరించారు. కానీ అటు టీడీపీ గాని, ఇటు జనసేన శ్రేణులు గాని ఇంకా తెగించేశారు. అరెస్ట్ అయిన పర్లేదు అని అనుకుంటున్నారు.రానున్న రోజుల్లో పవన్ మరింత దూకుడుగా వైసీపీపై పోరాడేలా ఉన్నారు..అయితే పవన్‌ని నిలువరించడానికి ఆయన్ని వైసీపీ నేతలు వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూనే ఉన్నారు. అంబటి రాంబాబు, జోగి రమేష్, గుడివాడ అమర్నాథ్, కొడాలి నాని లాంటి వారు దారుణంగా ఎగతాళి చేస్తూ మాట్లాడుతున్నారు. రెండుచోట్ల ఓడిపోయారని పదే పదే మాట్లాడుతున్నారు. అలాగే కేఏ పాల్, పవన్ ఒక్కటే అని సెటైర్లు వేస్తున్నారు. తెలంగాణలో పాల్..ఆంధ్రాలో పవన్ అంటున్నారు.అయితే పవన్‌ని ఎగతాళి చేస్తూ, తక్కువ అంచనా వేస్తే వైసీపీకే రిస్క్ తప్పదు. ఆయనకు గెలిచే సత్తా ఇప్పుడు లేకపోవచ్చు..కానీ వైసీపీని ఓడించే సత్తా మాత్రం ఉందని గట్టిగా చెప్పొచ్చు. ఇటు జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ని సైతం వైసీపీ గట్టిగానే టార్గెట్ చేసింది..వైజాగ్ ఘటన తర్వాత నుంచి పవన్‌ని వదలడం లేదు. తాజాగా ఇప్పటం గ్రామంలో రోడ్డు వెడల్పు అంటూ..అక్కడ కొందరు ఇళ్లని ప్రభుత్వం కూల్చివేసింది. అయితే గతంలో జనసేన ఆవిర్భావ సభకు ఇప్పటం గ్రామ ప్రజలు స్థలం ఇచ్చారు. ఆ కక్షతోనే ఇప్పుడు రోడ్డు వెడల్పు పేరుతో ఇళ్ళు కూల్చివేశారని చెప్పి పవన్..ఇప్పటం గ్రామంకు వచ్చి..బాధితులకు అండగా నిలిచి, వైసీపీపై విరుచుకుపడ్డారు. అలాగే మధ్యలో పోలీసులు పవన్‌ని ఆపిస్తే..ఆయన నడుచుకుంటూ ముందుకొచ్చారు.ఈ క్రమంలో అందరూ అరెస్ట్ అవ్వడానికి రెడీగా ఉండాలని, రక్తం చిందించిన పర్లేదు అని చెప్పి..పోలీసుల ముందే జనసేన శ్రేణులకు పిలుపునిచ్చారు. అంటే ఎంతమంది అయిన అరెస్ట్ చేసుకోండి అంటూ పవన్ తెగించి మాట్లాడేశారు. రోడ్లపై గుంతలు పూడ్చి విస్తరణ చేయాలంటూ ఫైర్ అయ్యారు.ఇదే క్రమంలో ఎవరికి ఏం జరిగినా సజ్జల రామకృష్ణారెడ్డిదే బాధ్యత అని పవన్ మాట్లాడారు. అంటే అంతా సజ్జల చేయిస్తున్నారని పవన్ ఫైర్ అవుతున్నారు. ఏదేమైనా గాని ఇంకా అరెస్టులకు భయపడేది లేదన్నట్లు పవన్ తెగించేశారు. ఎంతమందిని అరెస్ట్ చేస్తామో చూస్తామని అంటున్నారు. అటు టీడీపీ నేతలు కూడా అరెస్టులకు ఇంకా భయపడటం లేదు.

# ఇంకా ప్రారంభం కానీ పాదయాత్ర

కాకినాడ, నవంబర్ 9,అమరావతి రైతుల పాదయాత్ర ఇంకా మొదలు కాలేదు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఆగిన యాత్ర ఇంకా ప్రారంభం కాలేదు. హైకోర్టు తీర్పుతో తాము యాత్రను ప్రారంభిస్తామన్న రైతులు రోజులు గడిచినా ఇక ఇటు వైపు చూడటం లేదు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఆగిపోయిన అమరావతి టు అరసవిల్లి పాదయాత్ర ఆగిపోవడానికి అనేక కారణాలున్నాయని చెబుతున్నారు. హైకోర్టును ఆశ్రయించినా పెద్దగా ఫలితం లేకపోవడం ప్రధాన కారణమయితే, పోను పోను ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే అవకాశముందని భావించి యాత్రకు కొంత సంకోచిస్తున్నారని సమాచారం.మొత్తం అరవై రోజులకు యాత్రను ప్లాన్ చేశారు. అన్ని జిల్లాలు, ముఖ్యమైన నియోజకవర్గాల నుంచి వెళ్లేలా రూట్ మ్యాప్ ను సిద్ధం చేసుకున్నారు. ఇందుకోసం హైకోర్టు 600 మంది వరకూ రైతులు పాల్గొన వచ్చని చెప్పింది. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా గుర్తింపు కార్డులు తీసుకోవాలని ఆదేశించింది. అలాగే పాదయాత్ర సజావుగా జరిగేలా చూడాలని పోలీసు శాఖను కూడా కోరింది. ఉమ్మడి, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో యాత్ర కొంత నిరసనల మధ్య జరిగింది. గుడివాడలో అయితే కొంత ఉద్రిక్త వాతావరణం ఏర్పడినా పోలీసులు భద్రత కల్పించి వారిని అక్కడి నుంచి యాత్ర సజావుగా జరిగేలా చూశారు. అనంతరం రాజమండ్రిలో మాత్రం కొంత ఇబ్బంది ఎదురయింది. ఏకంగా రైతులకు, వికేంద్రీకరణ కావాలనుకుంటున్న వారికి మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఒకరిపై ఒకరు వాటర్ బాటిల్స్ విసురుకున్నారు. అక్కడి నుంచి టెన్షన్ ప్రారంభమయింది. అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చేరుకునే సరికి అక్కడ పోలీసులు గుర్తింపు కార్డులు చూపమన్నారు. నాలుగు వాహనాల కంటే అనుమతించేది లేదని చెప్పారు. దీంతో తాము మరోసారి న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని చెప్పి యాత్రకు బ్రేక్ ఇచ్చేశారు. ఎక్కువ మంది గుర్తింపు కార్డులు లేకపోవడంతోనే పోలీసులు అభ్యంతరం చెప్పారన్న వార్తలు వచ్చాయిమరోవైపు ఉత్తరాంధ్రలో వికేంద్రీకరణకు అనుకూలంగా సభలు, ర్యాలీలు మొదలయ్యాయి. అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చేరుకునే సరికి రైతుల యాత్ర 40 రోజుల వరకూ సాగింది. కానీ ఉద్రిక్తతలు తలెత్తడంతో కొంత వెనుకంజ వేశారు. అంతేకాకుండా న్యాయస్థానంలోనూ షరతుల్లో మార్పులు చేయబోమని చెప్పడంతో అమరావతి రైతుల యాత్ర ఊగిసలాటలో పడింది. నాలుగు రోజులు బ్రేక్ ఇస్తామని చెప్పిన రైతులు పక్షం రోజులు గడుస్తున్నా ఆ ఊసే ఎత్తడం లేదు. హైదరాబాద్ లో సమావేశాలు పెట్టుకుంటున్నారు. మొత్తం మీద అమరావతి రైతుల పాదయాత్ర తిరిగి కొనసాగుతుందా? లేదా? అన్నది కూడా చర్చనీయాంశంగా మారింది.

# సెల్ ఫోన్ లారీనే కొట్టేశారు-

కడప, నవంబర్ 9, ఏపీలో ఇటీవలే జరిగిన భారీ చోరీ కేసును వైఎసార్ కడప జిల్లా పోలీసులు ఛేదించారు. బ్లూడార్ట్ ద్వారా హర్యానా టూ చెన్నై కంటైనర్ లో తరలిస్తున్న ల్యాప్ టాప్ లు, సెల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ఇద్దరు అంతరాష్ట్ర నేరస్థులు కొట్టేశారు. వారిని పోలీసులు అరెస్ట్ చేశారు.ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయగా.. మరో నలుగురు పరారీలో ఉన్నట్లు జిల్లా ఎస్పీ కే.కే.ఎన్ అన్బురాజన్ తెలిపారు. పరారీలో ఉన్న నలుగురు నేరస్థులను అరెస్టు చేసేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. వీరి నుంచి రూ.1.58 కోట్ల విలువైన 1557 రెడ్ మి సెల్ ఫోన్లు, 4 యాపిల్ ఐఫోన్ 14 మోడల్ సెల్ ఫోన్లు, 5 ల్యాప్ ట్యాప్ లు, 193 బ్లూ టూత్ లు, ఆడి, ఇన్నోవా కార్లను స్వాధీనం చేసుకున్నారు. బ్లూ డార్ట్ కంపెనీ ఫిర్యాదుపై గత నెల 30వ తేదీన చిన్న చౌక్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు. ఈనెల 19వ తేదీన మొబైల్ ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులతో బ్లూడార్ట్ కంపెనీకి చెందిన ఒక కంటైనర్ లారీ నెం. ఊఖీ38-జ-3224, హర్యానా రాష్ట్రంలోని బిలాస్‌పూర్ నుంచి చెన్నైకి బయలుదేరింది. సదరు లారీని జుబెర్, క్లీనర్ వాసిమ్ నడుపుతుండగా.. 23వ తేదీన బ్లూ డార్ట్ ఎక్స్ ప్రెస్ లిమిటెడ్ మేడ్చల్ కు చేరుకుంది. అక్కడ కొన్ని సరకులు తీసుకొని హైదరాబాద్ గోడౌన్ కు చేరుకుంది. అక్కడ మరికొన్ని సరకులు తీసుకొని చెన్నై వెళ్లేందుకు బయలుదేరారు.మార్గమధ్యంలో కడప జిల్లాకు చెందిన దువ్వూరు మండలం గుడిపాడు గ్రామ సమీపంలోని సర్వీస్ రోడ్డు వద్ద ముద్దాయిలు కంటైనర్ లారీని ఆపి తాళాలు పగులగొట్టి కంటైనర్‌లో ఉన్న 1,68,58,671 రూపాయల విలువ చేసే మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులను దొంగలించుకు పోయారు. హైదరాబాద్‌లోని బ్లూడార్ట్ ఎక్స్ ప్రెస్ లిమిటెడ్‌లో సీనియర్ సెక్యూరిటీ ఎగ్జిక్యూటివ్ గా పని చేస్తున్న శివ ప్రసాద్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు 30వ తేదీన చిన్న చౌక్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. కేసును ఛాలెంజింగ్ గా తీసుకున్న వైఎస్సార్ కడప జిల్లా, ఎస్పీ, కె.కె.అన్బురాజన్.. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక టీంని ఏర్పాటు చేశారు. సీసీ టీవి ఫుటేజీల ద్వారా నిందితులను గుర్తించారు. ఈనెల 8వ తేదీ తెల్లవారుజామున ఈ కేసులోని ముద్దాయిల గురించి మరియు కేసులోని సొత్తు గురించి పక్కా సమాచారం రాగా.. కడప ఎస్డీపీఓ, సిబ్బందితో వాహన తనిఖీలు చేయుగా నిందితులు దొరికిపోయారు. ఊఖీ26-ఃఏ-4348 నెంబరు గల ఇన్నోవా కారు, ఊఖీ29-జ-0267 నెంబరు గల ఆడి కార్లలో... ం5, ం6 నిందితులు సొత్తును హైదరాబాద్ వైపు తీసుకుని వెళ్తున్నారు. కడప సిటీ, ఇర్కాన్ సర్కిల్ సమీపంలోని పాత టోల్ గేటు వద్ద ఈరోజు ఉదయము 11.30 గంటలకు కడప డీఎస్పీ బి.వెంకట శివారెడ్డి నిందితులను అరెస్ట్ చేశారు. విచారణలో తమ నేరాన్ని నిందితులు ఒప్పుకున్నారు.



## కాపు కాసేందుకు జగన్ ప్లాన్...

కాకినాడ, నవంబర్ 9,అగ్రవర్గాల్లో కూడా పేదలు ఉన్నారనే సంగతి తెలిసిందే..వారు ఎన్నో ఏళ్లుగా రిజర్వేషన్లు లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో గత 2019 ఎన్నికల ముందు కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం..అగ్రవర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు కేటాయించింది. ఈ రిజర్వేషన్లని ఒకో రాష్ట్రం ఒకోలా అమలు చేసుకున్నాయి. ఇదే క్రమంలో అప్పుడు ఏపీలో అధికారంలో ఉన్న చంద్రబాబు..10 శాతంలో 5 శాతం కాపులకు కేటాయించి?మిగిలిన 5 శాతం మిగతా వర్గాలకు కేటాయించారు.రాష్ట్రంలో కాపులు అత్యధికంగా ఉన్నారు..అందుకే కాపులకు 5 శాతం కేటాయించారు. పైగా ఎన్నో ఏళ్ల నుంచి తమని బీసీల్లో చేర్చాలని కాపులు పోరాటం చేస్తున్నారు. ఇక చంద్రబాబు అధికారంలోకి వచ్చాక..కాపు రిజర్వేషన్లపై తీర్మానం చేసి..అసెంబ్లీలో ఆమోదించి..కేంద్రానికి పంపారు. కానీ అక్కడ ఆమోదం రాలేదు. ఈలోపు కేంద్రం అగ్రవర్గాలకు 10 శాతం ఇవ్వడంతో..అందులోనే 5 శాతం కాపులకు ఇచ్చారు.అయితే అప్పుడు ప్రతిపక్ష నాయకుడుగా ఉన్న జగన్..కాపు రిజర్వేషన్లు సాధ్యపడదని చెప్పి..బీసీల ఓట్లపై కన్నేసి సక్సెస్ అయ్యారు. పైగా ఈ 10 శాతం రిజర్వేషన్లపై కోర్టులో కేసు పడింది. ఈ 10 శాతం ఇస్తే..ఓవరాల్ గా 50 శాతం రిజర్వేషన్లు దాటేస్తాయని కొందరు వ్యక్తులు పిటిషన్ వేశారు. దీంతో అధికారంలోకి వచ్చాక ఈ రిజర్వేషన్ల ఊసు జగన్ తీయలేదు. కానీ తాజాగా 50 శాతం రిజర్వేషన్లతో సంబంధం లేకుండా.. అగ్రవర్గాల 10 శాతం రిజర్వేషన్లని కోర్టు సమర్ధించిందిదీంతో దీనిపై జగన్ ప్రభుత్వం ఏం చేస్తుందనేది ఆసక్తికగా మారింది. ఈ 10 శాతంలో 5 శాతం కాపులకు కేటాయిస్తారా? లేదా? అనేది చూడాలి. ఎందుకంటే పవన్‌తో కాపు ఓట్లు వైసీపీకి దూరం అవుతాయి. ఆ కాపులని మళ్ళీ దగ్గర చేసుకోవాలంటే 5 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి. మరి జగన్ ఆ పనిచేస్తారా? లేదా? అనేది చూడాలి

## అక్రమ ఇసుక ను, అక్రమ మద్యాన్ని అరికట్టాలి....

### మాజీమంత్రి గొల్లపల్లి

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ రాజోలు నియోజకవర్గం లో అక్రమ ఇసుక అక్రమ మద్యం వ్యాపారాలని అరికట్టాలని మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు డిమాండ్ చేశారు. సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెం గ్రామంలో గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు గ్రామ ప్రజలతో కలిసి పాదయాత్ర చేసి ప్రధాన రహదారి పై నిరసన తెలియజేసారు. రాజోలు నియోజకవర్గంలో సముద్ర తీర వెంబడి అక్రమ ఇసుక అక్రమ మద్యం అమ్మకాలు యదేచ్చగా జరుగుతున్నాయని అధికార పార్టీ నాయకులు ఈ రెండింటిని ప్రధాన ఆదాయ వనరులుగా ఎంచుకున్నారని గొల్లపల్లి అన్నారు. సముద్ర తీరం వెంబడి బొండు ఇసుక త్రవ్వకాల వల్ల తీరప్రాంతంలో అమావాస్య, పౌర్ణమి పోటు సమయాలలో పంటపొలాలలోకి ఇళ్ల వద్దకు సముద్రం నీరు భారీగా వచ్చి చేరుతుందని దాని వల్ల వరి వ్యవసాయం కొబ్బరి చెట్లు పూర్తిగా నాశనం అయిపోతున్నాయని అన్నారు. ప్రభుత్వం మద్యం రేట్లు విపరీతంగా పెంచడం వల్ల ప్రభుత్వం అమ్మే మద్యాన్ని త్రాగలేక ప్రజలు నాటు సారా కు అలవాటు బడటం జరుగుతుందని నాటు సారా గంజాయి వంటి మత్తు పదార్దాలకు అలవాటు పడి ప్రజలు ఆరోగ్యాలను నాశనం చేసుకుంటున్నారని, ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా ప్రభుత్వం ఆదాయ మార్గాలను మాత్రమే చూసుకుంటూ సామాన్య ప్రజల జీవితాలను ఆరోగ్య పరంగా ఆర్ధిక పరంగా సర్వనాశనం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలతో పాటు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు....

## రాష్ట్రవ్యాప్తంగా వామపక్షాల నిరసనలు

విజయవాడవిజయవాడలో బుధవారం వామపక్ష పార్టీల నేతల సమావేశం జరిగింది. ప్రధాని మోడీ ఎపి పర్యటన సందర్భంగా భవిష్యత్తు కార్యాచరణ పై చర్చ జరిగింది.సిపిఐ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ ప్రధాని మోడీ ఈనెల 11,12 పర్యటన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమం చేపడతాం. మోడీ ఎపిని అన్నివిధాల మోసం చేసి, సిగ్గు లేకుండా వస్తున్నారు. మోడీ ప్రభుత్వం ఒక్క అంశంలో అయినా న్యాయం చేసిందా. జగన్ కూడా అధికార యంత్రాంగాన్ని మోడీ పర్యటన కు వినియోగిస్తున్నారు. వేల కోట్ల తో ప్లీనరీ సమావేశం తరహాలో ప్రచారం చేస్తున్నారు. హోదా లేదు, పోలవరం పూర్తి కాలేదు, విభజన హామీలు అమలు చేయలేదు. మోడీ మెడలు వంచుతా అన్న జగన్ మోడీ ముందు తల వంచుతూనే ఉన్నాడు. బిజెపి తమ కార్యక్రమం గా చెప్పుకుంటే.. విజయసాయి రెడ్డి వారికన్నా అత్యుత్సాహంతో ప్రకటన చేస్తున్నారు. అంటే మోడీ అంటే భయమా, కేసుక నుంచి బయట పడేందుకా అని అడిగారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటు పరం వద్దని మా వాళ్లు పోరాటాలు చేస్తున్నారు. మోడీ స్టీల్ ప్లాంట్ ప్రభుత్వం ఆధీనంలో ఉంచుతామని చెప్పాకే ఎపిలో అడుగు పెట్టాలి. ఈ రెండు రోజులు మా నిరసన కార్యక్రమం జరుగుతుంది. ప్రజలు కూడా నల్ల జెండాలతో నిరసన తెలపాలని అన్నారు.సిపిఎం నేత శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలకు ద్రోహం చేసిన వారికే... ప్రజల సొమ్ముతో పెద్ద పీఠ వేస్తున్నారు. రైల్వే జోన్ ఇవ్వరు.. ఎపికి అన్యాయం చేసిన వారికి సన్మానాలా. పోలవరం నిర్వాసితులను ఆదుకోవడం లేదు. లాభాలలో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటు పరం చేస్తారా. మోడీ నిర్ణయానికి వ్యతిరేకంగా అసెంబ్లీ లో జగన్ తీర్మానం చేశారు. ఇప్పుడు ఏమీ చేయకుండానే సాగిలపడి స్వాగతం పలుకుతారా అని ప్రశ్నించారు. బిజెపి తరహాలో వైసిపి కూడా ప్రజా వ్యతిరేక తప్పదు. సభలకు అనుమతి ఇచ్చి.. మళ్లీ నోటీసులు ఇవ్వడం ఏమిటి. రాష్ట్రం లో నిరసనకు తెలిపే హక్కు లేదా. మీ ఇష్టం వచ్చినట్లు చేస్తే ప్రతిపక్ష పార్టీలు చూస్తూ కూర్చుంటాయా. ఎపి ప్రభుత్వం కూడా మోడీ ని నిలదీయాలి. రాష్ట్రానికి మేలు చేసేలా హామీల అమలుకు డిమాండ్ చేయాలి. ఈనెల 11,12తేదీలలో వామపక్ష పార్టీలు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని అన్నారు.

## పట్టాలు తప్పిన గూడ్స్ రైలు?రైలు ట్రాఫిక్ కు ఆటంకం

రాజమహేంద్రవరం రాజమహేంద్రవరం స్టేషన్ సమీపంలో గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. దీంతో ఒకే ట్రాక్ పై రైళ్ల రాకపోకలు కొనసాగుతున్నాయి. గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో 9 రైళ్లు రద్దు కాగా.. రెండు పాక్షికంగా రద్దయ్యాయి. ఈమేరకు ద.మ రైల్వే వెల్లడించింది. విజయవాడ-లింగంపల్లి రైలు 2 గంటలు ఆలస్యంగా నడవనుంది. విజయవాడ=గవిశాఖ, గుంటూరు=గ విశాఖ, విజయవాడ- విజయవాడ, విశాఖ- విజయవాడ, విజయవాడ-గుంటూరు, కాకినాడ పోర్టు- విజయవాడ రైళ్లు పూర్తిగా రద్దవ్వగా.. విజయవాడ-రాజమహేంద్రవరం, కాకినాడ పోర్టు- విజయవాడ రైళ్లు పాక్షికంగా రద్దయ్యాయి...

# 2024 గెలుపే లక్ష్యంగా వైసీపీ వర్క్ షాపు




ఏలూరు, నవంబర్ 9, వచ్చే ఏన్నికలు వైసీపీకి చావో రేవో అని ఫిక్సైపోయిన ముఖ్యమంత్రి జగన్.. పార్టీని గెలుపు బాటలో నడిపించేందుకు శతథా ప్రయత్నిస్తున్నారు. ఇందు కోసం పలు నిర్ణయాలు తీసుకుంటున్నారు. గడప గడపకూ అంటూ ఎమ్మెల్యేలనూ, మంత్రులనూ పరుగులు పెట్టిస్లున్నారు. 24లీ7 సర్వేలు, నిఘాలు అంటూ చెమటలు పట్టిస్తున్నారు. ఇంత చేస్తున్నా ప్రభుత్వ గ్రాఫ్ ఇసుమంతైనా పెరగడంలేదన్న నిఘా నివేదికలతో జగన్ ఖంగారెత్తిపోతున్నారు.175 కు 175 స్థానాల్లో విజయం అన్న అసాధ్యమైన లక్ష్యన్ని పెట్టుకుని జగన్ తమను ఇరుకున పెట్టి వేధిస్తున్నారన్న అభిప్రాయమే మెజారిటీ ఎమ్మెల్యేలలో వ్యక్తం అవుతోంది. ముందు స్వయంగా జగన్ తన పనితీరుపై నివేదిక తెప్పించుకుని ఉంటే.. ఆయన మీద ఆయనే వేటు వేసుకోవలసిన పరిస్థితి ఉండేదని పలువురు ఎమ్మెల్యేలు ప్రైవేటు సంభాషణల్లో సెటైర్లు వేసుకుంటున్నారని పార్టీ శ్రేణులే అంటున్నాయి. మొత్తం మీద వచ్చే నెల 4న జరగనున్న వర్క్ షాప్ విషయంలో ఎమ్మెల్యేలలో ఆందోళనే తప్ప ఆసక్తి లేదని పరిశీలకులు చెబుతున్నారు.ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించాలంటే వచ్చే ఎన్నికలలో సాధ్యమైనంత మంది కొత్త వారికి పార్టీ టికెట్లు ఇచ్చి పోటీలోకి దింపాలని జగన్ భావిస్తున్నారని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అందుకే ఈ మూడున్నరేళ్లలో పార్టీ ఎమ్మెల్యేలు నాయకులను కలవడానికి పెద్దగా ఆసక్తి కనబరచని జగన్ ఇప్పుడు ఎ విజయం కోసం తాను నమ్ముకున్న గడపగడపకూపై వరుస సమీక్షలు చేస్తున్నారు. ఎమ్మెల్యేలకూ, మంత్రులకూ వార్నింగ్ లు కూడా ఇచ్చేస్తున్నారు. తాజాగా మరో సారి గడపగడపకూ పై వర్క్ షాపు పెట్టాలని నిర్ణయంచుకున్నారు. ఇందుకు వచ్చే నెల 4 ముహూర్తం ఖరారు చేశారు.వైనాట్ 175 అవుటాఫ్ 175 అంటున్న జగన్ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉండటంతో మంత్రులు, ఎమ్మెల్యేలపై ఒత్తిడి పెంచేస్తున్నారు. ఇప్పటికే జరిగిన రెండు వర్క్ షాపులతో.. వారిలో జగన్ తో బేటీ అంటేనే ఇదెక్కడి గోలరా భగవంతుడా అనుకునే పరిస్థితి వచ్చేసింది. ఇక రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న గడపగడపకూ మన ప్రబుత్వం కార్యక్రమంపై ఫీల్డ్ నుంచి నేరుగా అందిన ఫీడ్ బ్యాక్ ప్రాతిపదికగా ఎమ్మెల్యేల పనితీరును జగన్ బేరీజు వేస్తున్నారు. ప్రజలలో ఎమ్మెల్యేల పట్ల ఉన్న సానుకూలత, ప్రతికూలతలను అంచనా వేస్తున్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమమే.. ప్రజలలో ఎమ్మెల్యేల పట్ల సానుకూలత, వ్యతిరేతకలను బేరీజు వేసి వచ్చే ఎన్నికల్లో ఎవరికి టికెట్లు ఇవ్వాలి, ఎవరికి తిరస్కరించాలి అన్న విషయాన్ని జగన్ నిర్ణయిస్తారని పార్టీ శ్రేణులు అంటున్నాయి. పాలన, సంక్షేమ పథకాల అమలుపై ప్రజాభిప్రాయ సేకరణ కోసమే గడపగడపకు అని చెబుతున్నప్పటికీ ఈ కార్యక్రమ వాస్తవ లక్ష్యం మాత్రం ఎమ్మెల్యేల పనితీరు బేరీజు వేయడానికేనని అంటున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత అంతకంతకూ పెరుగుతోందన్న సమాచారం నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో సాధ్యమైనంత మంది కొత్త వారికి టికెట్లు ఇవ్వడం ద్వారా..ప్రజా వ్యతిరేకతను తగ్గించుకోవాలన్నది జగన్ వ్యూహంగా పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. వచ్చే నెల 4న జగన్ మరో సారి వర్క్ షాప్ నిర్వహించనున్నారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జీలు, కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులకు ఈ మేరకు వారికి ఇప్పటికే సమాచారం పంపారు. నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే ఏ మేరకు అందుబాటులో ఉంటున్నారు, ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో ఏ మేరకు చొరవ చూపుతున్నారు, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలపై ప్రజా వ్యతిరేకత, సానుకూలత తదితర అంశాలపై ఇప్పటికే జగన్ వద్ద నివేదిక ఉందని పార్టీ శ్రేణులే చెబుతున్నాయి. ఐప్యాక్ టీమ్‌లు జగన్ ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించినట్లు సమాచారం. గతంలో జరిగిన రెండు వర్క్‌షాప్ లలో కొందరు ఎమ్మెల్యేలకు వైఎస్ జగన్ డెడ్‌లైన్ విధించిన విషయం తెలిసిందే. అలా జగన్ వార్నింగ్ ఇచ్చిన వారిలో మంత్రులు కూడా ఉన్నారు. తాజాగా వచ్చే నెల 4న జరిగే వర్క్ షాపులో అప్పుడు వార్నింగ్ ఇచ్చిన వారి పని తీరును మరోసారి సమీక్షిస్తారనీ, ఏ మాత్రం మెరుగుపడకపోయినా.. ఇక వారికి వచ్చే ఎన్నికల్లో టికెట్ హుళక్కేననీ అంటున్నారు. అదే విషయాన్ని ఈ వర్క్ షాపులో జగన్ విస్పష్టంగా తేటతెల్లం చేసే అవకాశం ఉందని అంటున్నారు. ఇప్పుడు అదే విషయంపై ఎమ్మెల్యేలలో ఆందోళన వ్యక్తం అవుతోంది. గతంలో వార్నింగ్ ఇచ్చిన వారే కాకుండా.. తాజాగా తన వద్ద నివేదికలో పనితీరు మెరుగ్గా లేదని తేలిన ఎమ్మెల్యేల పట్ల కూడా జగన్ కఠిన వైఖరినే అవలంబించనున్నారన్న పార్టీ పెద్దల సంకేతాలతో పలువురు ఎమ్మెల్యేలలో ఆందోళన వ్యక్తం అవుతోంది.

# అవినీతికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి




### గ్రామ ప్రజల ఆవేదనఒక్కొక్క రికి 20 నుంచి 30 వేలు డిమాండ్

### డిప్యూటి కలెక్టర్ కు వినతిపత్రం

కౌతాళం అవినీతి కి పాల్పడుతున్న అధికారులు పై కఠిన చర్యలు తీసుకోవాలని కుంటనహల్ గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తంచేశారు. వారు మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కౌతాళం మండలం, కుంటన హాళ్ గ్రామం ప్రజల సంక్షేమంలో భాగంగా ఇండ్లు, మరుగుదొడ్ల కొరకు కేటాయించిన సొమ్ము మొత్తాన్ని లబ్ధిదారుల ఇవ్వకుండా, సంబంధిత అధికారులు, నాయకులు అవినీతికి పాల్పడుతున్నారన్న ఆరోపణల విషయమై వెంటనే విచారణ జరిపించి అందుకు కారకులైన వారిపై చట్టపరమైన చర్యలుతీసుకోవాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు అందేలా, అవినీతి అక్రమాలు జరగకుండా అడ్డుకట్ట వేసేందుకు సచివాలయ వ్యవస్థ మరియు వాలెంటీర్స్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు నేరుగా మంచి చేయాలనే ఆలోచనతో ఉంది. అయితే అధికారులు, మా గ్రామ ప్రజలపట్ల అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని వారు నిరుపేదలకు ఇల్లు మంజూరు చేయాలంటే ఒక్కొక్కరికి ఇరవై వేల రూపాయల నుండి ముఫై వేల రూపాయల వరకు లంచం డిమాండ్ చేస్తున్నారాని ఆవేదన వ్యక్తంచేశారు.అధికారులు లంచాల వసూలు విషయంలో " తాము ఏ మాత్రం తగ్గేదేలేదని, ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి" అని మరీ దబాయిస్తున్నారని మండలము అసిస్టెంట్ ఇంజనీర్ " మేము మా ఆఇ ఆదేశాల ప్రకారం లబ్ధిదారులకు ఫోన్ చేసిమరీ, ఫోన్ పే ద్వారా డబ్బులు వసూలు చేయడం" దుర్మార్గమైన విషయం మంత్రాలయం నియోజక వర్గంలో జూఖీ హౌసింగ్ స్కీం కింద 9,814 మందికి, ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన స్కీం కింద 312 మందికి ఇండ్లకు అనుమతులు మంజూరు అయ్యాయి. అధికారులు పైన చెప్పిన విధంగా లంచాలు వసూలు చేస్తే , ఆ సొమ్ము దాదాపు 30 కోట్ల రూపాయలు దాకా అవుతుంది. వారు పేదవారి నుండి లంచాలు వసూళ్లు చేస్తున్నారు. ప్రజలు వారడిగిన లంచం ఇవ్వడానికి నిరాకరించిన వారికి, ఇళ్లు నిర్మించుకొని సంవత్సరాలు గడిచినా బిల్లులు చేయడం లేదు. అలాగే మన ప్రధానమంత్రి గారు స్వచ్ఛ భారత్ కోసం వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం కొరకు నిధులు కేటాయించగా, మా గ్రామానికి చెందిన నాయకులు ఆ సొమ్మును వాటాలు వేసుకొని మరీ పంచుకుంటున్నారని పేర్కొన్నారు. హౌసింగ్ అధికారులపైన, నిధులను స్వాహా చేస్తున్న విషయంగా వారిపై వచ్చిన ఆరోపణలపై వెంటనే సమగ్ర విచారణ జరిపించి, అందుకు బాధ్యులైన వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకొని లబ్ధిదారులకు తగిన న్యాయం చేయాలని కోరారు .అనంతరం డిప్యూటీ కలెక్టర్ అభిషేక్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చంద్ర కుమార్ ,సతీష్ గౌడ్, కుమ్మరి కృష్ణ,,తదితరులు ఉన్నారు.

# గ్రహణం పట్టని గుడి.. ప్రత్యేక పూజలు, అభిషేకాలు?

### భారీ సంఖ్యలో భక్తులు

కాకినాడ, నవంబర్ 9, ఈ ఏడాది చిట్ట చివరి చంద్ర గ్రహణం ఏర్పడింది. గ్రహణ సమయంలో ప్రజలు అనేక ఆచారాలను, పద్దతులను పాటించారు. చంద్రగ్రహణ సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రాలను, ఆలయాలను మూసివేశారు. కొన్ని ప్రాంతాల్లో గ్రహణ పట్టు స్నానాలను చేశారు? మరొకొందరు గ్రహణ సమయంలో ప్రత్యేక పద్ధతిలో మంత్రాలను పాటిస్తూ తమ ఇష్టమైన దేవుడిని ఆరాధిస్తున్నారు. చంద్ర గ్రహణ సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రహణం సందర్భంగా అనేక ప్రాంతాల్లోని మహిళలు పోటీపోటీగా ఇత్తడి పళ్లెంలో రోకలిని నిలబెట్టారు.కాకినాడ జిల్లా కిర్లంపూడి రమణయ్యపేటలో చంద్రగ్రహణం సందర్భంగా ఇత్తడి పళ్ళెంలో మహిళలు నీరు పోసి రోకలిబెట్టారు. ఇంటి ముందు ముగ్గవేసి.. అందంగా ఆ ముగ్గుని అలంకరించి పూజాది కార్యక్రమాలను నిర్వహించి.. ఆ ముగ్గులో ఇత్తడి పళ్లెం ఏర్పాటు చేశారు. అనంతరం ఆ పళ్లెంలో నీరు పోసి.. రోకలిని పెట్టారు. గ్రహణ సమయంలో రోకలి నిటారుగా నిలబడింది. ఈ రోకలి సాయంత్రం చంద్రగ్రహణం పట్టు విడిచే వరకు నిలబడే ఉంటుందని మహిళలు చెబుతున్నారు. .. గ్రహణ సమయాల్లో అరుదుగా కనిపించే ఇటువంటి దృశ్యాలను తిలకించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.హిందూసనాతన ధర్మంలో గ్రహణకాలానికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. ఈ గ్రహణ సమయాన్ని సూతకంగా భావిస్తారు. ప్రజలు ఏ పనులను చేయరు.. అంతేకాదు .. దేశ వ్యాప్తంగా ఆలయాలనుంచి ప్రముఖ క్షేత్రాల వరకూ అన్నింటిని గ్రహణ సమయానికంటే మూసివేస్తారు. సూర్య గ్రహణం, చంద్రగహణం ఇలా ఏ గ్రహణం ఏర్పడినా సరే గుడులన్నీ మూసివేస్తారు. గ్రహణం వీడిన తర్వాత సంప్రోక్షణ చేపట్టి ఆలయాన్ని శుద్ధి చేసి అనంతరం మళ్ళీ భక్తులకు ఆలయదర్శన భాగ్యాన్ని కల్పిస్తారు. ఈ ఆచారం ఎప్పటినుంచో వస్తున్నదే.. అయితే ఈ గ్రహణ సమయంలో కూడా దేశ వ్యాప్తంగా కొన్ని దేవాలయాలు తెరచి ఉంటాయి. యధావిధిగా పూజాదికార్యక్రమాలను అందుకుంటాయి. అటువంటి దేవాలయాల్లో ప్రముఖంగా వినిపించే పేరు ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాళహస్తి ఒకటి అయితే.. గ్రహణాలు పట్టని గుడి మరొకటి కూడా ఉంది. ఈ గుడి తూర్పుగోదావరి జిల్లాలో శ్రీ శక్తి పీఠంగా ఖ్యాతిగాంచింది.పిఠాపురం పట్టణంలో గ్రహణాలు పట్టని గుడి ఒకటి ఉంది. సూర్య, చంద్రగ్రహణం ఏదైనా సరే యధావిధిగా తెరచి ఉంటుంది.. పాదగయ పుణ్యక్షేత్రం. ఇక్కడ కుక్కుటేశ్వర స్వామి యధావిధిగా పూజలను అందుకుంటారు. అనాది కాలంగా వస్తున్న పూర్వపు ఆచారం ప్రకారం తెలుగు రాష్ట్రాలలో శ్రీకాళహస్తి, పిఠాపురం పాదగయ క్షేత్రం గ్రహణ సమయంలో తెరిచి ఉండే దేవాలయాలు.. చంద్రగ్రహణకాలం లోను భక్తులకు దర్శనాలు, పూజలు ఉంటాయని ఆలయ అధికారులు చెప్పారు.ప్రధాన ఆలయాలైనా రాజరాజేశ్వరి సమేత శ్రీ ఉమాకుక్కుటేశ్వర స్వామి, అష్టాదశ శక్తి పీఠం పురుహూతికా అమ్మవారు, స్వయంభూ దత్తాత్రేయ స్వామి వారులను దర్శించుకోవడానికి భారీ సంఖ్యలో భక్తులు బారులు తీరారు. చంద్ర గ్రహణం కాలంలో పట్టు.. విడుపు స్నానాలు చేసి అభిషేకాలు, అర్చనలు వంటి కైంకర్యాలను అర్చకులు నిర్వహిస్తారు.

## నేడు సి.పి.బ్రౌన్ 224వ జయంత్యుత్సవం

కడప తెలుగు సూర్యుడు' సి.పి.బ్రౌన్ 224 జయంత్యుత్సవాన్ని గురువారం ఉదయం 10.30 గంటలకు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించనున్నామని బాధ్యులు డా. మూల మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పుస్తకావిష్కర్తగా యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మునగల సూర్యకళావతి, సభాధ్యక్షులుగా ప్రముఖ కథారచయిత, బ్రౌన్ కేంద్రం సలహామండలి సభ్యులు షేక్ హుస్సేన్ సత్యాగ్ని, విశిష్ట అతిథిగా కులసచివులు ఆచార్య దుర్భాక విజయ రాఘవ ప్రసాద్, ప్రధాన వక్తగా శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ విశ్రాంత ఆచార్యులు ఆచార్య మేడిపల్లి రవికుమార్, ఆత్మీయ అతిథులుగా అసిస్టెంట్ కమిషనర్ (జిఎస్టీ'ప్రొద్దుటూరు'1 సర్కిల్) మోరంరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్రోపన్యాసకులు (రాజంపేట) డా ఐ.ఎల్.ఎన్.చంద్రశేఖర రావు, గౌరవ అతిథులుగా మొల్ల సాహితీ పీఠం అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు (బద్వేలు), పుట్టపర్తి సాహిత్య పీఠం కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం (ప్రొద్దుటూరు) పాల్గొంటారు. కార్యక్రమంలో భాగంగా 'వైయస్సార్ కడప జిల్లా చరిత్ర' పుస్తకం ఆవిష్కరింప బడుతుంది. కార్యక్రమాన్ని కేంద్రం బాధ్యులు డా.మూల మల్లికార్జున రెడ్డి నిర్వహిస్తారని తెలిపారు

## కోనేరు సెంటర్ లో దొంగల హల్ చల్

మచిలీపట్నం మంగళవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా నగరం లో ఉన్న పోలీసులు వివిధ ప్రాంతాల బందోబస్తు నిర్వహిస్తున్నారు ఇదే అదును చూసుకుని నగరంలో దొంగలు రెచ్చిపోయారు. కోనేరు సెంటర్ లో ఇనుపకొట్టు రోడ్ లో ఉన్న మట్టూరి పూర్ణ,గణేష్ స్టీల్స్, ఇంకో రెండు షాపులను పలుగులతో షట్టర్లను ధ్వంసం చేసి మరి దొంగతనానికి పాల్పడ్డారు. మచిలీపట్నం నగరంలో అర్ధ రాత్రి రెండు గంటలకు జరిగిన సంఘటన ఒక్కసారి మచిలీపట్నం ప్రజలు హవక్కయారు. స్వల్పం గా నష్టం జరిగిందని వినికిడి. నగరం నడిబొడ్డు లో జరిగిన దొంగతనం ప్రజలను భయభ్రాంతులకు గురి గురౌతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు నగరంలో గస్తీ ఏర్పాట్లు కూడా చేస్తా బాగుంటుందని ప్రజలు కోరుకుంటున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా వలందపాలెం లో బేకరి వ్యాపారి ఎర్పాటు చేసుకున్న సీసి కెమెరాలను సైతం దొంగలు దొంగలించారు. ముఖం గుర్తుపట్టకుండా మాస్కులు ధరించి దొంగతనానికి పాల్పడ్డారు అని అంటున్నారు స్థానికులు.


## జుట్టు రాలిపోయే సమస్యతో బలవన్మరణం

తిరువనంతపురం, నవంబర్ 9,జుట్టు రాలే సమస్య చాలా మందికి సాధారణ సమస్య. ఇటీవలి కాలంలో యువతలో ఈ సమస్య మరింతగా పెరుగుతోంది. ఎన్ని మందులు, చికిత్సలు తీసుకున్నా సమస్య పరిష్కారం కావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే, కేరళలోని కోజిక్ కోడ్‌లో జుట్టు రాలిపోయే సమస్యతో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు.. సాలినేరి సమీపంలోని ప్రభాకరన్ కుమారుడు ప్రశాంత్ ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చాలా కాలంగా మందులు వాడుతున్నప్పటికీ, కనుబొమ్మలు, శరీరంలోని ఇతర భాగాలపై వెంట్రుకలు రాలిపోతున్నాయనే మనస్తాపంతో కేరళలోని కోజికోడ్‌కు చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. తన చావుకు కారణాలపై సూసైడ్ లెటర్ రాసిపెట్టాడు. తనకు చికిత్స చేసిన వైద్యుడిని తప్పుబడుతూ సూసైడ్ లేఖలో పేర్కొన్నాడు. కోజికోడ్‌కు చెందిన తన ఇంట్లోనే ప్రశాంత్ శవమై కనిపించాడు.జుట్టు రాలిపోవడానికి వైద్యం అందించిన వైద్యుడే తన చావుకు కారణమని ప్రశాంత్ తన లేఖలో పేర్కొన్నాడు.. ఈ సమస్యతో ఇంటి నుంచి బయటకు కూడా రాలేకపోతున్నానని లేఖలో ప్రస్తావించాడు. జుట్టు రాలిపోతుందనే సమస్యతో 2014 నుంచి సదరు డాక్టర్ వద్ద చికిత్స తీసుకుంటున్నాడు. డాక్టర్ చెప్పిన మాత్రలు వేసుకున్నా కనుబొమ్మలు, ముక్కు వెంట్రుకలు రాలిపోయాయి. జుట్టు రాలడం ఆగిపోతుందన్న ఆశతో 2020 వరకు అంటే 6 ఏళ్ల పాటు మందులు వాడినట్లు తెలిసింది.కానీ చికిత్స తీసుకున్నప్పటికీ, అతని కనుబొమ్మలపై వెంట్రుకలు కూడా తగ్గుతున్నాయి. దీంతో తనను ఎవరూ పెళ్లి చేసుకోవటం లేదని ఆందోళనలోపడ్డాడు.. ఈ నేపథ్యంలోనే విసిగిపోయి జీవితాన్ని ముగించుకుంటున్నట్లు ఆత్మహత్యకు పాల్పడిన ప్రశాంత్ అనే యువకుడు తన డెత్ నోట్ లో రాశాడు.ప్రశాంత్‌కు చికిత్స అందించిన వైద్యుడు రఫీక్‌పై అథోలి పోలీసులకు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవటం లేదని ప్రశాంత్ కుటుంబ సభ్యులు ఆరోపించారు. అలాగే పేరంబ్రా ఏఎస్పీకి కూడా ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఇదిలా ఉండగా, ఎలాంటి నేరం జరగలేదని, తదుపరి విచారణ జరుపుతున్నామని అథోలి ఎస్ఐ తెలిపారు. అలాగే డాక్టర్‌ని విచారించామని, అయితే నిందితుడిగా పరిగణించలేదని చెప్పారు. అలాగే పోస్టుమార్టం నివేదిక కోసం కూడా ఎదురుచూస్తున్నామని పోలీసులు తెలిపారు.

## మనవరాలితో రఘురామరెడ్డి డ్యాన్స్

అనంతపురం, నవంబర్ 9, రఘువీరారెడ్డి ఒకప్పుడు ఫేమస్ లీడర్.. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేబినెట్ మంత్రిగా పనిచేశారు. రాష్ట్ర విభజన తర్వాత కొంత కాలం పీసీసీ అధ్యక్షుడిగా కొనసాగారు. ఆ తర్వాత నెలకొన్న పరిణామాలతో రాజకీయాలకు స్వస్తిచెప్పి జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఎక్కువగా కుటుంబంతో గడుపుతున్నారు. ఎలాంటి హంగూ ఆర్భాటాలు లేకుండా సాదాసీదా వ్యక్తిగా జీవిస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి రఘువీరారెడ్డి తన మనవరాలితో కలిసి స్టెప్పులేసిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది.టీవీలో వస్తున్న ఓ పాటకు ఆయన డ్యాన్స్ చేశారు. ఇది చూసిన నెటిజన్లు ఆయనపై కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. లీడర్ అంటే మీలా ఉండాలి అని కామెంట్స్ పెడుతున్నారు. ఎలాంటి ఆర్భాటాలు లేకుండా జీవించడంలో మీకు మీరే సాటి అని ప్రశంసిస్తున్నారు. ఈ వయసులోనూ ఇంత చలాకీగా ఉండడం ఆయనకే చెల్లిందంటున్నారు. కాగా, క్రియాశీల రాజకీయాలకు రఘువీరా దూరమైన తర్వాత సోషల్ మీడియాలో తరచూ కనిపిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం పెట్టిన ఓ పోస్టు కూడా వైరల్ అయింది. ఓ బావిని చూపిస్తూ తాను చిన్నప్పుడు ఇదే బావిలో ఈత నేర్చుకున్నానని, ఇప్పుడు ఇదే బావిలో తన మనవరాలికి ఈత నేర్పిస్తున్నట్టు ఆ పోస్టులో పేర్కొన్నారు. సాధారణ ఓటర్‌గా క్యూ లైన్‌లో నిల్చొని ఎన్నికల్లో ఓటేసిన సమయంలో ఆయనకు అందరి నుంచి మంచి మన్ననలు అందాయి.

# బద్వేలలో సజీవంగా ఆక్రమణలు



బద్వేలు , దర్గాగా రహదారులు మురికి కాలువలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన దురాక్రమదారులపై సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు కనీసం అలాంటి ప్రయత్నాలు కూడా చేయకపోవడం విమర్శలకు కారణమవుతుంది అసలు దురాక్రమలపై చర్యలు తీసుకుంటారా లేదా అన్నది శేష ప్రశ్నగా మారింది ఆక్రమణలు ఏ స్థాయిలో ఉన్న వాటిని తొలగించాలని ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమరావతిలో జరిగిన ఉన్నత అధికారుల సమావేశంలో స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు ముఖ్యమంత్రి సొంత జిల్లా అయిన బద్వేలు లో గత కొన్ని దశాబ్దాలుగా రహదారి పక్కనే ఆక్రమణ లు కొనసాగుతున్నాయి ఇది అందరికి తెలిసిన బహిరంగ రహస్యమే మురికి కాలువలు రోడ్లు ఆక్రమించి నిర్మాణాలు చేసి వాటిని వేల రూపాయలకు బాడుగలకు ఇచ్చి ప్రతి నెల వసూలు చేసుకుంటున్నారు ఆక్రమణల కారణంగా రహదారులు ఇరుకై తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి ఇప్పటికే ఎన్నో ప్రమాదాలు జరిగాయి జరుగుతున్నాయి కూడా ప్రమాదాల్లో ఎంతోమంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి పట్టణంలోని నాలుగు ప్రధాన రహదారుల్లో పెద్ద ఎత్తున ఆక్రమణలు ఉన్నాయిపట్టణంలో మైదుకూరు నెల్లూరు కు వెళ్లే ప్రధాన రహదారి జాతీయ రహదారిగా ఉంది జాతీయ రహదారి మాటే గాని గతంలో ఎలా ఉందో ఇప్పుడు కూడా అలాగే ఉంది జాతీయ రహదారి నిర్మించేటప్పుడు సంబంధిత అధికారులు ఆక్రమణ లు తొలగించేందుకు రోడ్డుకు ఇరువైపులా మార్కింగ్ ఇచ్చారు కానీ రాజకీయాలు

### ఆక్రమణలపై చర్యలు తీసుకునే అధికారులు ఎక్కడ


చోటు చేసుకోవడంతో తర్వాత ఎటువంటి ఆక్రమణలు తొలగించకుండానే రహదారి నిర్మించారు కాలువలు రహదారులు ఆక్రమించారని ఆక్రమణదారులకు అధికారులు అప్పట్లోనే నోటీసులుకూడా ఇచ్చారు కొందరు పెద్దలు ఆక్రమణదారుల నుంచి పెద్ద ఎత్తున ముడుపులు దండుకొని ఆక్రమణ జోలికి పోకుండా అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చి సఫలీకృతులయ్యారు దీంతో ఎటువంటి ఆక్రమణలు తొలగించ కుండానే పట్టణంలో జాతీయ రహదారి నిర్మించారు పేరుకే జాతీయ రహదారి కానీ గతంలో రహదారి ఎలా ఉండేదో ఇప్పుడు కూడా అలాగే ఉంది గతంలో మున్సిపల్ పాలకవర్గం అధికారులు కొన్ని అక్రమ కట్టడాలు తొలగించినప్పటికీ రాజకీయ ఒత్తిడి ల కారణంగా ఆక్రమాల తొలగింపు పూర్తిస్థాయిలో జరగలేదు తొలగించిన కట్టడాల స్థానంలో తిరిగి నిర్మాణాలు జరిగాయి తమ ఆస్తిని ఆక్రమించి నిర్మాణాలు చేశారని ఆర్టీసీ అధికారులు సంవత్సరాల తరబడి చెబుతున్న వారి రోదన అరణ్య రోదనగా మారింది పోరుమామిళ్ల రహదారిలో ఆక్రమణ సంగతి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ ఆక్రమించి పలు దుకాణాలు వెలిశాయి బాడుగల్కి ఇచ్చి ప్రతినెల వేల రూపాయలు దండుకుంటున్నారు ఇదేమి అన్యాయమని అడిగేవారు లేకుండా పోయారుఆక్రమణలు తొలగించాలని ప్రజలు సంవత్సరాల తరబడి వేడుకుంటున్న అధికారుల్లో ఏమాత్రం స్పందన లేకపోవడం విచారకరం గతంలో అప్పటి జిల్లా ఇన్చార్జి మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సైతం బద్వేల్ లో ఆక్రమణలు పరిశీలించి వాటిని రెండు వారంలోగా తొలగించాలని అధికారులకు ఆదేశాలిచ్చారు కానీ ఫలితం మాత్రం లేకుండా పోయింది తమను ఎవరు ఏమి చేయాలన్న ధీమా ఆక్రమణదారుల బలంగా ఉంది గతంలో అప్పటి కడప జిల్లా కలెక్టర్ హరికిరణ్ అప్పటి జిల్లా ఎస్పీ బాబూజీ అట్టాడ బద్వేల్ లో రెండు గంటలపాటు నాలుగు రోడ్ల కూడలిలో మకాం వేసి ఆక్రములంటిని పరిశీలించారు గుర్తించిన ఆక్రమణలు త్వరితగతిన తొలగిస్తామని చెప్పడం జరిగింది అయినా ప్రయోజనం లేకుండా పోయింది

# కర్నూలు పశ్చిమ ప్రాంతంలో ప్రభుత్వ విద్యా సంస్థలు నెలకొల్పాలి



కౌతాళం : ఆదోని మండలంలోని పద్మావతి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో సీమ విద్యార్థి సంఘం(రా.ఎ.రా) గర్ల్స్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎస్.వి.ఎస్ జిల్లా అధ్యక్షుడు బాలు రాష్ట్ర నాయకులు నవీన్ కుమార్ మాట్లాడుతూ ప్రాంతీయ సమస్య లపై నిత్యం పోరాడుతున్న రాయలసీమ కో ఆర్డినేషన్ కమిటీ(ఆర్.సి.సి) అనుబంధ సీమ విద్యార్థి సంఘంలో చేరాలని పిలుపునిచ్చారు,రాష్ట్రంలో అక్షరాస్యతలో వెనుకబడిన కర్నూలు పశ్చిమ ప్రాంతంలో పభుత్వ విద్యాసంస్థలు నెలకొల్పి నిరక్షరాస్యతను పారద్రోలాలని అన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్న ఈ కర్నూలు పశ్చిమ ప్రాంతం సమస్యలు తీరడం లేదని అన్నారు.ఇప్పటికైనా ఆదోనిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల,అగ్రికల్చర్ యూనివర్సిటీ,మైనింగ్ కళాశాల మరియు ప్రభుత్వ హాస్టళ్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలి అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.నూతన కళాశాల కమిటీ అధ్యక్షురాలు ఇందు కార్యదర్శి అర్చన సహాయ కార్యదర్శి భాను సాయి శ్రీ, బాలురు కమిటీ అధ్యక్షుడిగా అశోక్ నరసింహ నాగిరెడ్డి 50 మంది విద్యార్థులతో కళాశాల కమిటీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు వీర కార్యదర్శి నాగేంద్ర ఎల్లప్ప గణేష్ ఉదయ్ షేక్షావలి రాజు ముని అశోక్ ఉపేంద్ర తదితరులు హాజరయ్యారు.

# రాముడికే ట్రోల్స్ తప్పలేదు.. హనుమంతుడి పరిస్థితి ఎలా ఉంటుందో..!




తేజా సజ్జా హీరోగా క్రియేటివ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ తెరకెక్కిస్తున్న తాజా చిత్రం "హను-మాన్". కెరీర్ ప్రారంభం నుంచీ విభిన్నమైన జోనర్లలో సినిమాలు చేస్తున్న ప్రశాంత్.. ఇప్పుడు యంగ్ హీరోతో కలిసి ఫస్ట్ పాన్-ఇండియన్ సూపర్ హీరో మూవీతో అలరించడానికి రెడీ అయ్యారు. 'జాంబీ రెడ్డి' వంటి కమర్షియల్ హిట్ తర్వాత వీరిద్దరి కాంబోలో రాబోతున్న సినిమా కావడంతో అందరిలో అంచనాలు నెలకొన్నాయి.ఇప్పటికే "హను మాన్" ప్రమోషనల్ కంటెంట్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ క్రమంలో నవంబర్ 15న టీజర్ ను గ్రాండ్ గా రిలీజ్ చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. దసరాకి రిలీజ్ చేయాలనీ అనుకున్నారు కానీ.. 'ఆదిపురుష్' కోసం వాయిదా వేసుకున్నట్లు తెలిపారు. పండక్కి హనుమాన్ అప్డేట్ ని ప్లాన్ చేశామని.. కానీ ఆరోజు ఏకంగా రాముడే వస్తుండడంతో మా అప్డేట్ వాయిదా వేసుకున్నామని.. రాముడొచ్చిన తర్వాత ఆయన వెనుకే హనుమాన్ వస్తాడని పేర్కొన్నారు.ఇన్ని రోజులకు 'హను మాన్' మేకర్స్ చెప్పినట్లుగా టీజర్ ను విడుదల చేయబోతున్నారు. అయితే రాముడి గాథను తెలియజేసే 'ఆదిపురుష్' సినిమా టీజర్ పై పెద్ద ఎత్తున ట్రోల్స్ వచ్చిన నేపథ్యంలో.. ఇప్పుడు హనుమంతుడి కథను చెప్పే మూవీ టీజర్ ఎలా ఉంటుందో.. ఏ మేరకు మెప్పిస్తుందో.. ఎలాంటి కామెంట్స్ వస్తాయెా అని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది.ఇటీవల కాలంలో వచ్చిన సూపర్ నేచురల్ సినిమాల విజువల్ ఎఫెక్ట్స్ పై సోషల్ మీడియాలో ట్రోల్స్ వస్తుండటం చూస్తున్నాం. ఏమాత్రం క్వాలిటీ తగ్గినా నెటిజన్లు దారుణంగా కామెంట్స్ చేస్తున్నారు. 'బ్రహ్మాస్త్రం' సినిమా వీఎఫ్ఎక్స్ వర్క్ పై నెగెటివ్ రెస్పాన్స్ వచ్చింది. అలానే ప్రభాస్ 'ఆదిపురుష్' టీజర్ చుట్టూ విపరీతమైన ట్రోలింగ్ జరిగింది. విజువల్స్ మరియు సీజీ వర్క్ నాసిరకంగా ఉన్నాయని విమర్శలు చేసారు. దీంతో ఇప్పుడు మెరుగైన అవుట్ ఫుట్ కోసం ఏకంగా ఐదు నెలలు వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. మన పురాణాలు ఇతిహాసాల్లో అద్భుత శక్తులున్న సూపర్ హీరోస్ గురించి మనకు తెలుసు. అపూర్వమైన శక్తులు బలాలు పోరాటపటిమ కొనియాడబడుతున్నాయి. అలాంటి అద్భుతమైన శక్తులు ఓ సామాన్యుడికి వస్తే ఎలా ఉంటుందనే కథతో "హను-మాన్" సినిమా తెరకెక్కుతోందని టాక్ ఉంది. సూపర్ హీరో మూవీ కాబట్టి విజువల్ ఎఫెక్ట్స్ కు ప్రాధాన్యత ఉంటుంది. ఖచ్చితంగా గ్రాఫిక్స్ పరంగా మంచి క్వాలిటీని చూపించాల్సి వస్తుంది.వచ్చే వారం రాబోయే 'హను మాన్' టీజర్ లోనూ నాణ్యమైన వీఎఫ్ఎక్స్ ను అందరూ ఎక్స్పెక్ట్ చేస్తారు. ఏమాత్రం నాసిరకంగా ఉన్నా నెట్టింట దారుణమైన ట్రోలింగ్ ఎదుర్కోవాల్సి వస్తుంది. అందులోనూ ఇది సూపర్ హీరో సినిమా కావడంతో మనోళ్లు కాస్త ఎక్కువే ఆశిస్తారని చెప్పాలి. కాకపోతే తక్కువ బడ్జెట్ లో క్వాలిటీ సినిమా తీస్తాడని డైరెక్టర్ ప్రశాంత్ వర్మ కు ఇండస్ట్రీలో మంచి పేరుంది. ఇప్పటి వరకూ ఆయన తెరకెక్కించిన సినిమాలన్నీ విజువల్ ఎఫెక్ట్స్ పరంగా మెప్పించాయి.ఇప్పుడు 'హను మాన్' అంతకుమించి ఉండొచ్చని సినీ అభిమానులు భావిస్తున్నారు. బడ్జెట్ కూడా ఎక్కువే పెట్టారు కాబట్టి.. అందులో ఎక్కువ భాగం వీఎఫ్ఎక్స్ కోసం ఖర్చు చేసి ఉంటారని అనుకుంటున్నారు. ఈ సినిమాలో తేజ సరసన అమృత అయ్యర్ హీరోయిన్ గా నటిస్తోంది. విలక్షణ నటుడు వినయ్ రాయ్ విలన్ గా నటిస్తుండగా.. వరలక్ష్మి శరత్ కుమార్ కీలక పాత్ర పోషిస్తోంది.ప్రైమ్ షో ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై కె.నిరంజన్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అస్రిన్ రెడ్డి ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అనుదీప్ దేవ్ - హరి గౌర - జయ్ క్రిష్ - కృష్ణ సౌరభ్ వంటి నాలుగు మ్యూజిక్ డైరెక్టర్లు ఈ సినిమా కోసం పని చేస్తున్నారు. "హను-మాన్" సినిమా తెలుగు తమిళం కన్నడ మలయాళం హిందీ భాషలలో పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

# నవంబర్ 11న ఎడ్యుకేషన్ డేను ప్రతి మద్రస నిర్వహించాలి

### : ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి. యూనుస్...




నంద్యాల నవంబర్ 09 స్వతంత్ర భారతదేశంలో మొట్టమొదటి విద్యాశాఖ మంత్రిగా ఎన్నికైన భారతదేశ అతిపెద్ద, విద్యావేత్త, తత్వవేత్త ఒక ముస్లింసమాజం నుండి గౌ॥ శ్రీ మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆయన జయంతి నాడు ప్రభుత్వాలు పుట్టినరోజు వేడుకలను లేదా మైనారిటీ డేగా మాత్రమే జరుపుకుంటారు కానీ వాస్తవానికి "ప్రతి వ్యక్తికి విద్యా హక్కు ఉంది" అని మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసి చూపించారు. మరి వారి వారసులం అయిన ముస్లిం సమాజం అదే విద్యకు ఇంకా దూరంగా ఉంది. మరియు అదే విధంగా విద్యను ఇస్లాం ప్రోత్సహిస్తుంది కాబట్టి ప్రతి ఒక్క ముస్లిం లింగ బేధం లేకుండా విద్యను అభ్యసించి దేశం మరియు జాతి నిర్మాణంలో పాలు పంచుకోవాలి. అందుకు గాను నవంబర్ 11న ఎడ్యుకేషన్ డేగా ప్రతి మద్రస నిర్వహించాలి. ఎందుకు అంటే దీని వల్ల మౌలానా త్యాగాలను రాబోయే తరాలకు అందించటానికి తోడ్పాటు మరియు అదే విధంగా మన ముస్లిం మైనారిటీ సమాజంలో విద్య ఆవసఖ్యతను ప్రోత్సహించే అవకాశం ఉంటుందని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి. ఎాఎట యూనుస్ అభిప్రాయ పడ్డారు.

# మున్సిపల్ కార్యాలయంలో 25 సీసీ కెమెరాలు ఏర్పాటు....

నంద్యాల నవంబర్ 09 నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో 5 నెలలుగా జరుగుతున్న వరుస సంఘటలను దృష్టిలో పెట్టుకొని అధికారులు 25 సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు.వందేళ్ల చరిత్రలో ఎందరో మహానుభావులు ,అధికారులు నంద్యాల మున్సిపాలిటీలో పదవులు,అధికారాలు పొందారు.మున్సిపాలిటీలో ఎన్నడూ లేనివిధంగా ప్రతి శాఖ లంచాల మయంగా మారిపోవడం తో పత్రికలు,చానల్స్,సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారుతుంది.ఓ అధికారి ముక్కుమీద కోపం అటు అధికారులు,ఇటు మీడియా ప్రతినిధులను సైతం చిందులు వేస్తున్నారు.ఆ అధికారి వచ్చినప్పటి నుంచి ఏ ఒక్క అధికారిని విధిచిపెట్టకుండా ఇష్టారాజ్యంగా మాట్లాడటం ఆయనకు మాములయింది.సమాచారం అడిగే మీడియా ను సైతం సీరియస్ గా మాట్లాడటం జరుగుతుంది.చివరకు కొందరు కౌన్సిలర్లకు కూడా పరాభవం ఎదురైనా బయటికి చెప్పుకోలేని పరిస్థితి.కొద్ది రోజుల క్రితం సాక్షాత్తు మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా తో ఘర్షణ పడిన విషయం తెలిసిందే.మైనార్టీ సంఘాలు ఒక్క రోజు హడావిడి చేసి ఒక్కసారిగా నిశ్శబ్దంగా ఉండడం వెనుక కొందరు బడా బాబుల సమక్షంలో సారి చెప్పినట్లు సమాచారం.అధికారికి,ఛైర్మెన్ మధ్య నేటికి పచ్చిగడ్డి వేస్తే మండుతున్నట్లు సమాచారం.మరో వైపు జరుగుతున్న సంఘటలను జీర్ణించుకోలేక,రాజీ పడలేక జనవరిలో మరో ప్రాంతానికి బదిలీ కావడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం.ఈ నేపథ్యంలోనే అసలు మున్సిపాలిటీలో జరిగే సంఘటనలకు

### 1.50 లక్షలు ఖర్చు....సచివాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి.

అధికారులే మీడియాకు ఉప్పు అందిస్తున్నారని సందేహిస్తున్నారు.మున్సిపాలిటికి వచ్చే మీడియా ప్రతినిధులు ఎవరేవరితో మాట్లాడుతున్నారని విషయాలు తెలుసుకునేందుకు ప్రతి సెక్షన్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తున్నారు.వీటిని మున్సిపల్ ఛైర్మెన్ మాబున్నిసా,మున్సిపల్ కమీషనర్ రవి చంద్రారెడ్డి,అసిస్టెంట్ కమీషనర్ వెంకట దాస్,మున్సిపల్ ఇంజనీయర్ రమణ మూర్తి సెల్లులకు కనెక్షన్ ఇస్తున్నారు.ప్రధాన కారణం సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు హాజరు కాకపోయినా జీతాలు తీసుకుంటున్నారని ఆధారాలతో మీడియా వెలికితీయడంతో కొందరు సస్పెండ్ అయిన విషయం తెలిసిందే.ప్రస్తుతం సచివాలయాల్లో సిబ్బంది ఎవరు వేస్తున్నారో ఎవరికి తెలియదు,జీతాలు మాత్రం అందరికి సమన్యాయం జరుగుతుంది.సమన్యాయంలో తిలా పాపం తలా పిడికెడు అన్న చందంగా కొందరు అధికారులు వాటాలు పంచుకుంటున్నట్లు సమాచారం.ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయాలకు సచివాలయ సిబ్బంది తూట్లు పొడుస్తున్నా అధికారులు ముక్కువడిగా తనిఖీలు చేస్తూ మమా అనిపిస్తున్నారు.మున్సిపాలిటీలో ఏర్పాటు చేస్తున్న విధంగా సచివాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తే ప్రజలకు న్యాయం జరుగుతుంది.

# అభిమానం ఉంటే అది మాత్రం చేయండి చాలంటున్న వరలక్ష్మి!



ప్రముఖ నటుడు శరత్ కుమార్ కుమార్తెగా సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టిన వరలక్ష్మి శరత్ కుమార్ గురించి ప్రత్యేకమైన పరిచయాలు అవసరం లేదు. భారీ సినీ బ్యాక్ గ్రౌండ్ ఉన్నప్పటికీ.. తనదైన టాలెంట్ తో తక్కువ సమయంలోనే విలక్షణ నటిగా గుర్తింపు పొంది భారీ ఫాలోయింగ్ ను సంపాదించుకుంది.ప్రస్తుతం ఈ అమ్మడు స్టార్ హీరోల సినిమాల్లో మంచి ప్రాధాన్యత ఉన్న పాత్రలను చేస్తూనే.. మరోవైపు లేడీ ఓరియెంటెడ్ చిత్రాల్లో నటిస్తోంది. తెలుగు తమిళ్ కన్నడ భాషల్లో వరలక్ష్మి దాదాపు పది చిత్రాల్లో భాగమైంది. ఇక ఆమె నటించిన 'యశోద' చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సమంత టైటిల్ రోల్ లో తెరకెక్కిన ఈ సినిమాకు హరి-హరీష్ ద్వయం దర్శకత్వం వహించారు.శ్రీదేవి మూవీస్ బ్యానర్పై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన ఈ చిత్రంలో వరలక్ష్మి శరత్ కుమార్ ఉన్ని ముకుందన్ రావు రమేశ్ మురళీ శర్మ తదితరులు కీలక పాత్రలు పోషించారు. నవంబర్ 11న ఈ సినిమా తెలుగుతో పాటు తమిళ కన్నడ మలయాళం హిందీ భాషల్లో అట్టహాసంగా విడుదల కాబోతోంది.అయితే మయోసైటిస్ అనే ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న కారణంగా సమంత ప్రమోషన్స్ కు దూరంగా ఉంటుంది. దీంతో సమంత తర్వాత ఆమెకు సమాంతర పాత్రను పోషించిన వరలక్ష్మి శరత్ కుమార్ ప్రచార కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ యశోద పై హైప్ క్రియేట్ చేస్తుంది. ఇందులో భాగంగా వరలక్ష్మి తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది.ఈ సందర్భంగా ఆమె సినిమాకు సంబంధించి ఎన్నో ఇంట్రెస్టింగ్ విషయాలను పంచుకుంది. యశోద ఒక ఫిక్షనల్ స్టోరీ అని ఇందులో సరోగసి ఒక టాపిక్ మాత్రమే అని వరలక్ష్మి చెప్పుకొచ్చింది. ఈ క్రమంలోనే సినీ తారల వ్యక్తిగత జీవితాల గురించి కూడా ఆమె ఆసక్తికర కామెంట్స్ చేసింది. వరలక్ష్మి మాట్లాడుతూ.. 'ఇప్పుడంతా సెలబ్రిటీల లైఫ్ లో సరోగసి గురించి చాలా మంది మాట్లాడుకుంటున్నారు.ఎవరికి వారు తమ లైఫ్ కి సంబంధించిన విషయాలను పక్కన పెట్టేసి ఇతరుల లైఫ్ లోకి తొంగి చూసేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీనికి కారణం వాళ్లకి పని లేకపోవడమే. సినీ తారల పట్ల అభిమానం ఉంటే వారి సినిమా చూడండి .. ఎలా ఉందో చెప్పండి చాలు. అంతేగానీ వాళ్ల పర్సనల్ విషయాలను గురించి మాట్లాడవద్దు. ఆ హక్కు ఎవరికీ లేదు' అంటూ చెప్పకొచ్చింది. దీంతో వరలక్ష్మి చేసిన కామెంట్స్ కాస్త నెట్టింట వైరల్ గా మారాయి.

# ఫైనల్లో భారత్- పాక్? మేము ఆ అవకాశం ఇవ్వము!




: పదిహేనేళ్ల క్రితం.. టీ20 ప్రపంచకప్ తొలి ఎడిషన్ ఫైనల్ మ్యాచ్‌ను క్రికెట్ ప్రేమికులు అంత తేలికగా మర్చిపోలేరు.చిరకాల ప్రత్యర్థులు భారత్- పాకిస్తాన్ మధ్య ఆఖరి ఓవర్ వరకు నరాలు తెగే ఉత్కంఠ రేపిన ఆ మ్యాచ్‌లో ధోని సేన 5 పరుగులతో విజయం సాధించింది. తొలి టీ20 వరల్డ్‌కప్ ట్రోఫీని కైవసం చేసుకుంది.సుదీర్ఘ కాలం తర్వాత ఈ మెగా ఐసీసీ టోర్నీలో మరోసారి దాయాదులు ఫైనల్ చేరే అవకాశాలు మెండుగా ఉన్నాయి. టీ20 ప్రపంచకప్-2022 తొలి సెమీ ఫైనల్‌లో బుధవారం (నవంబరు 9)పటిష్టమైన న్యూజిలాండ్‌ను ఓడించి ఫైనల్ చేరాలని ఉవ్విళ్లూరుతోంది. మరోవైపు.. గురువారం నాటి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌ను ఓడించి తుది మెట్టుపై అడుగుపెట్టాలని టీమిండియా పట్టుదలగా ఉంది.అన్నీ కుదిరి రెండు జట్లు ఫైనల్ చేరితే తమకు పండుగే అంటున్నారు ఫ్యాన్స్. అయితే, తామేమీ అంత సులువుగా తలవంచమని, ఫైనల్లో దాయాదులు పోటీ పడే అవకాశం ఇవ్వమంటున్నాడు ఇంగ్లండ్ కెప్టెన్ జోస్ బట్లర్. అడిలైడ్ వేదికగా నవంబరు 10న టీమిండియా- ఇంగ్లండ్ మధ్య రెండో సెమీ ఫైనల్ జరుగనున్న విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో మీడియాతో మాట్లాడిన బట్లర్.. "ఫైనల్లో ఇండియా వర్సెస్ పాకిస్తాన్ ఉండాలని మేము అస్సలు కోరుకోవడం లేదు. కచ్చితంగా టీమిండియా అవకాశాలు దెబ్బతీస్తాము. నిజానికి వాళ్లది పటిష్టమైన జట్టు.సెమీ ఫైనల్ ఆడేందుకు ఆతురతగా ఎదురుచూస్తున్నాం. ముఖ్యంగా మేటి జట్టు అయిన భారత్‌తో పోటీ మరింత రసవత్తరంగా ఉంటుంది. టీమిండియాను ఎదుర్కొనేందుకు మేము సిద్ధంగా ఉన్నాం" అని చెప్పుకొచ్చాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190